Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా TV PRAJA TELEVISION The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 188 | హైదరాబాద్ | సోమవారం 01 జూన్ 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# రెండో కప్పు.. భలే కిక్కు

## ఐపీఎల్-19 విజేత బెంగళూరు

### టైటిల్ నిలబెట్టుకున్న పాటీదార్ సేన.. ఛేదనలో మెరిసిన కోహ్లి

### విజృంభించిన భువి, హేజిల్‌వుడ్, రసిఖ్.. ఫైనల్లో టైటాన్స్ ఓటమి



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఐపీఎల్-19 ఫైనల్లో ఈ డిఫెండింగ్ ఛాంపియన్ 5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించింది. మొదట గుజరాత్ తీవ్రంగా తడబడింది. బెంగళూరు బౌలర్ల ధాటికి 8 వికెట్లకు 155 పరుగులే చేయగలిగింది. రసిఖ్ సలామ్ (3/27), భువనేశ్వర్ (2/29), హేజిల్‌వుడ్ (2/37), కృనాల్ పాండ్య (1/23) ఆ జట్టును దెబ్బతీశారు. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్; 37 బంతుల్లో 5x4) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి (75 నాటౌట్; 42 బంతుల్లో 9x4, 3x6) చెలరేగడంతో లక్ష్యాన్ని ఆర్సీబీ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వెంకటేశ్ అయ్యర్ (32; 16 బంతుల్లో 4x4, 2x6) రాణించాడు. తొలి క్వాలిఫయర్‌లో బెంగళూరు 92 పరుగుల తేడాతో గుజరాత్‌ను చిత్తు చేసిన సంగతి తెలిసిందే తక్కువ లక్ష్యాన్నే నిర్దేశించినా.. ఆర్సీబీపై ఒత్తిడి తేవడానికి టైటాన్స్ ప్రయత్నించింది. కానీ ఆ జట్టుకు కోహ్లి అడ్డుగా నిలిచాడు. కడవరకూ క్రీజులో ఉండి తన జట్టును గెలిపించాడు. గుజరాత్ బ్యాటర్లు తడబడ్డ అదే పిచ్‌పై ఛేదనను బెంగళూరు ధాటిగా ఆరంభించింది. ఓపెనర్లు కోహ్లి, వెంకటేశ్ అయ్యర్ ధనాధన్ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. రబాడ ఓవర్లో అయ్యర్ మూడు ఫోర్లు, సిక్స్ బాదాడు. సిరాజ్ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన కోహ్లి.. రబాడ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6, 4తో విరుచుకుపడ్డాడు. 4 ఓవర్లకే 55/0తో లక్ష్యాన్ని మరింత తేలికగా మార్చుకుంది ఆర్సీబీ. ఆ దశలో వరుస ఓవర్లలో అయ్యర్, పడిక్కల్ (1)ను ఔట్ చేసి పోటీలోకి వచ్చే ప్రయత్నం చేసింది టైటాన్స్. కానీ పాటీదార్ (15)తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్ నడిపించాడు. పరుగుల వేగం తగ్గినా ఆర్సీబీ కంగారూ పడాల్సిన అవసరం లేకపోయింది. 8 ఓవర్లకు స్కోరు 88/2. కానీ రషీద్ ఖాన్ ఒకే ఓవర్లో పాటీదార్, కృనాల్ (1)ను ఔట్ చేసి మ్యాచ్‌లో కాస్త ఆసక్తి నింపాడు. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆ తర్వాత పరుగులు అంత తేలికగా రాలేదు. కానీ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన

- మిగతా 2వ పేజీలో



# ఎండలతో జాగ్రత్త!

### శరీరాన్ని ఎప్పుడు హైడ్రేట్ చేసుకోండి

### అత్యవసరమైతేనే బయటకు రండి

### 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ సూచనలు

న్యూఢిల్లీ, మే 31: దేశవ్యాప్తంగా ఎండలు తీవ్రమయ్యాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. ఎప్పటికప్పుడు శరీరాన్ని హైడ్రేట్ చేసుకోవాలని, అందుకు తరచూ నీరు తాగాలని కోరారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన యావత్ దేశ పౌరులను ఉద్దేశించి మాట్లాడారు. పగటి పూట అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. అనంతరం మోదీ 'నమామి గంగే' ప్రాజెక్ట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమం అద్భుత ఫలితాలను ఇస్తున్నదని కొనియాడారు. గంగా

- మిగతా 2వ పేజీలో



# కోరుకున్నది దక్కకపోతే..

### ఇరాన్‌తో ఒప్పందం మరోవిధంగా ముగిస్తాం

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్: పశ్చిమాసియాలో హోర్ముజ్ జలసంధి దిగ్బంధం సహా యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో మంచి ఒప్పందానికి అమెరికా, ఇరాన్‌లు చాలా దగ్గరగా వచ్చేశాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అయితే, తాము కోరుకున్నది లభించకపోతే ఆ ఒప్పందాన్ని వేరే విధంగా ముగిస్తామని ట్రంప్ తెలిపారు. ఫాక్స్ న్యూస్‌లో తన కోడలు లారాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పలు అంశాలపై మాట్లాడారు. ఇరాన్‌తో ఒప్పందానికి చాలా సమీపంలోకి వచ్చేశామని ట్రంప్ వ్యాఖ్యానించారు. కానీ, తొందరపడితే మంచి ఒప్పందం కుదరదని అభిప్రాయపడ్డారు. నెమ్మదిగా అయినా సరే కచ్చితంగా తాము

- మిగతా 2వ పేజీలో



# భారత్‌లో 'పాక్' దురంధర్‌లు!

### శత్రుదేశంలోకి అక్రమంగా చొరబడతాడు..

### స్థానికంగా పరిచయం పెంచుకుంటాడు..

### క్రిమినల్ ముఠాలు, రాజకీయ నాయకులకు దగ్గరవుతాడు..

### భారత్‌లో 'పాక్' దురంధర్‌లు!

### జాతీయ రాజకీయ పార్టీల్లో చేరాలని తమ అనుచరులకు పాక్ ఐఎస్ఐ ఆదేశాలు

న్యూఢిల్లీ, మే 31: శత్రుదేశంలోకి అక్రమంగా చొరబడతాడు.. స్థానికంగా పరిచయం పెంచుకుంటాడు.. క్రిమినల్ ముఠాలు, రాజకీయ నాయకులకు దగ్గరవుతాడు.. రాజకీయ పార్టీల్లో తిరుగుతాడు.. అక్కడి నుంచి చేసే కుట్రలన్నీ తెలుసుకుని సమాచారమిస్తాడు.. క్రిమినల్స్‌ను చంపేస్తాడు.. ఇదంతా ఇటీవల సంచలనం సృష్టించిన దురంధర్ సిరీస్ సినిమాల్లోని కథ. ఇదే

- మిగతా 2వ పేజీలో



# హామీలు అమలు చేసే దమ్ముందా?

## చేతకాకపోతే ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించాలి

### సీఎం రేవంత్‌కి కేటీఆర్ సవాల్

### మోటర్లకు మీటర్లపై సీఎం అబద్ధం చెబుతుండు

### ఉచిత విద్యుత్ ఎత్తివేతకే 'రైతు డిస్కం'

### రేవంత్ చెప్పింది చేయడని ప్రజలకు అర్థమైంది

### కార్యకర్తల సమావేశంలో విమర్శలు

హైదరాబాద్, మే 31 (ప్రజాతీర్పు): సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని, చేతకాకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో జరిగిన పార్టీ సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేవలం రైతులకున్న ఉచిత కరెంట్‌ను పూర్తిగా రద్దు చేసేందుకే ప్రత్యేకంగా రైతు డిస్కం తీసుకొస్తున్నారని విమర్శించారు. నిన్న ముఖ్యమంత్రి రైతుల మోటార్లకు మీట ర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పి మరోసారి అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ఇదే రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పు డు రైతన్నలకు కేవలం 3 గంటల కరెం ట్ ఇస్తే సరిపోతుందని చెప్పి, సరిగ్గా అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని ఆచరణలోకి తీసుకువచ్చేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాడని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ ప్రారంభించిన ఉచిత విద్యుత్‌ను రైతన్నలకు అందకుండా చేసేందుకు

- మిగతా 2వ పేజీలో



# సాగుకు ఉరితాడే రైతు డిస్కం

### డిస్కంల అప్పులపై సీఎం వ్యాఖ్యలు అవాస్తవాలు

### సోలార్‌తో 24 గంటల విద్యుత్ ఎలా సాధ్యం?

### ఆర్పీడీసీఎల్ నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే విద్యుత్ ఉద్యమం

### మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్, మే 31 (ప్రజాతీర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'రైతు డిస్కం' (టీజీఆర్పీడీసీఎల్) ఏర్పాటును బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించడానికే ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 8 ప్రకారం రైతు డిస్కంకు అధికంగా పునరుత్పాదక ఇంధన విద్యుత్‌ను కేటాయించనున్నట్లు పేర్కొన్నారని, సోలార్ విద్యుత్ పగటి వేళల్లో మాత్రమే అందుబాటులో ఉంటుందని హరీశ్ రావు అన్నారు. అలాంటప్పుడు రైతులకు 24 గంటల విద్యుత్ ఎలా అందిస్తారో ముఖ్యమంత్రి స్పష్టం చేయాలని హరీశ్‌రావు డిమాండ్

- మిగతా 2వ పేజీలో



# పగలు ఎండ.. రాత్రి వాన

### అకాల వర్షంతో జనం అవస్థలు.. ఆరో తేదీ వరకు వర్షాలు

హైదరాబాద్: రాష్ట్రంలో పగలంతా ఎండ, పొద్దుపోయే సమయానికి భారీ వర్షాలు.. ఇటువంటి భిన్నమైన వాతావరణం రైతులతోపాటు జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఎటువంటి సంకేతాలు లేకుండానే ఒక్కసారిగా భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతున్నాయి. ఇటీవల పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు పంట దిగుబడులు కొట్టుకుపోయాయి. కల్లాలు, వాహనాల్లో నింపిన ధాన్యమంతా వానపాలైంది. జూన్ ఆరో

- మిగతా 2వ పేజీలో

# విచ్ఛిన్నానికి కుట్ర

## మా మధ్య అంతర్యుద్ధానికి పన్నాగం

- చిల్లర రాజకీయాలు మానుకోవాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- ఎంపీ ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా వెలిసిన ఫ్లెక్సీలపై ఖండన
- డీజీపీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ సీపీలకు ఫిర్యాదు



బీజేపీ నేతల ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, మా మధ్య అంతర్యుద్ధానికి కొందరు పన్నాగం పన్ను తున్నా రని, మా మధ్య విభేదాలు సృష్టించడానికి కొన్ని పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలని హెచ్చరిం చారు.

# పగలు ఎండ.. రాత్రి వాన

(మొదటి పేజీ తరువాయి)

తేదీ వరకు ఇలాంటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణశాఖ(ఐఎండీ) ఆదివారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో (గంటకు 40-50 కి.మీ. వేగం) కూడిన వర్షాలు కురవనున్నట్లు తెలిపింది. అన్ని జిల్లాల్లో ఈ వర్షాలు కురుస్తాయని, పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది.

**ఎండల తీవ్రత కూడా..**

రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎండల తీవ్రత కొనసాగుతుందని ఐఎండీ పేర్కొంది. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో 44 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. మంగళ, బుధ, గురువారాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లా గ్రామీణ మండలంలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మరో 29 జిల్లాల్లో 40.1 నుంచి 44.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదుకాగా, జోగులాంబ గద్వాల, వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో 39.6-39.8 డిగ్రీలు నమోదయ్యాయి. ములుగు జిల్లా వాజేడు, మంగపేట, ఏటూరునాగారం మండలాల్లో వడగాలులు నమోదయ్యాయి.

**ఐదేళ్లలో అధికం..**

ఈ ఏడాది వేసవి రాష్ట్రాన్ని అల్లాడించింది. నిజామాబాద్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో గత రికార్డులను అధిగమిస్తూ పలుమార్లు 46.5 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు వారానికన్నా ఎక్కువ రోజులు నమోదయ్యాయి. గత ఐదేళ్లలో ఈ ఏడాదే వడగాలులతో ఎక్కువ మరణాలు సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. సోమవారం నుంచి వానాకాలం ప్రారంభం కానున్నప్పటికీ రుతు పవనాలు రాష్ట్రాన్ని తాకేందుకు పది రోజులకు పైగానే సమయం పడుతుందని అంచనా. ఆరో తేదీ తరువాత వాతావరణం కొంత చల్లబడుతుందని పేర్కొంటున్నారు.

# కోరుకున్నది దక్కకపోతే..

(మొదటి పేజీ తరువాయి)

కోరుకున్నది సాధిస్తున్నామని తేల్చిచెప్పారు. కోరుకున్నది దక్కేదాకా వేచి చూస్తామని, ఒప్పందం విషయంలో తొందరేమీ లేదని సంకేతాలిచ్చారు. చర్చల విషయంలో ఇరానీయులు మంచి నిపుణులు అని అన్నారు. కానీ, ఇరాన్ సైనికపరంగా ఇప్పటికే ఓడిపోయినందున ప్రస్తుతం అన్ని అవకాశాలు అమెరికా చేతిలోనే ఉన్నాయని స్పష్టంచేశారు. ఇరాన్‌తో ఒప్పందం చేసుకోగలిగితే మంచిదేనని.. లేకపోతే యుద్ధాన్ని మళ్లీ ప్రారంభించాల్సి వస్తుందని తేల్చిచెప్పారు. అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయడం లేదని ఇరాన్ చెప్పిందని ట్రంప్ అన్నారు. ఒకవేళ వారు(ఇరాన్) అణ్వాయుధాన్ని కొనుగోలు చేస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అలాంటి ఆయుధాన్ని కొనుగోలు చేయబోమని ఇరాన్ హామీ ఇచ్చిందన్నారు. ఇరాన్ నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమయ్యాయని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్‌పై అమెరికాకు గణనీయమైన పట్టు సాధించిందని తెలిపారు. అయితే, ఇరాన్ నాయకత్వంలో కొందరు మితవాదులు ఉండడంతో తాము ఇరాన్ సైన్యాన్ని పూర్తిగా నిర?వర్యం చేయలేదని అన్నారు. ఇరాన్‌లోని అత్యంత తీవ్రవాద శక్తులను, కీలక నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నామని పునరుద్ఘాటించారు. మరోవైపు ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన 60 రోజుల తాత్కాలిక ఒప్పందంపై సంతకం చేయడానికి ట్రంప్ నిరాకరించిన సంగతి తెలిసిందే. అందులోని అంశాలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

# సాగుకు ఉరితాడే రైతు డిస్కం

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ ఇస్తేనే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని సీఎం బహిరంగంగా ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. మూడో డిస్కం ఏర్పాటుతో కాళేశ్వరం, దేవాదుల, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, సీతమ్మ సాగర్ వంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతాయని ఆయన పేర్కొన్నారు. డిస్కంల అప్పుల విషయంలో ముఖ్యమంత్రి చేస్తున్న ఆరోపణలను కూడా హరీశ్ రావు ఖండించారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల కాలంలో ప్రభుత్వం డిస్కంలకు రూ.27 వేల కోట్లు బకాయి పడిందని, సగటున ఏడాదికి సుమారు రూ.రెండు వేల కోట్లు మాత్రమేనని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వల్ప కాలంలోనే రూ.25,284 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ఏడాదికి సగటున రూ.10 వేల కోట్లకు పైగా అప్పుల భారాన్ని మోపిందని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను గణనీయంగా విస్తరించామని హరీశ్ రావు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల సామర్థ్యాన్ని భారీగా పెంచి తెలంగాణను విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. రైతు డిస్కం ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.




కోహ్లి, రసిఖ్

# రెండో కప్పు.. భలే కిక్కు

(మొదటి పేజీ తరువాయి)

కోహ్లి.. ఎలాంటి నాటకీయతకు అవకాశమివ్వలేదు. టిమ్ డేవిడ్ (24; 17 బంతుల్లో 3x4, 1x6), జితేశ్ శర్మ (11 నాటౌట్)లతో కలిసి పని పూర్తి చేశాడు. తేలిపోయిన గుజరాత్: మొదట టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న బెంగళూరు బంతితో సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మందకొడి పిచ్‌పై షాట్లు ఆడడం టైటాన్స్‌కు కష్టమైపోయింది. టాప్ ఆర్డర్‌పై అతిగా ఆధారపడ్డందుకు ఆ జట్టు మూల్యం చెల్లించుకుంది. పేసర్లు భువనేశ్వర్, హేజిల్‌వుడ్ మరోసారి సత్తా చాటారు. మూడో ఓవర్లో గిల్ (10)ను ఔట్ చేయడం ద్వారా టైటాన్స్ పతనాన్ని హేజిల్‌వుడ్ ఆరంభించగా.. తర్వాతి ఓవర్లో సుదర్శన్ (12)ను భువి ఔట్ చేశాడు. అక్కడి నుంచి టైటాన్స్‌కు అన్నీ కష్టాలే. వికెట్లు క్రమం తప్పకుండా పోగా.. స్కోరు బోర్డు కష్టంగా కదలింది. నిశాంత్ సింధు (20), బట్లర్ (19) జట్టును ఆదుకునేందుకు ప్రయత్నించారు కానీ.. అది కాసేపే. 13వ ఓవర్లో బట్లర్ స్టంపౌటయ్యే సమయానికి స్కోరు 73 మాత్రమే. అయితే మరో ఎండ్‌లో సుందర్ నిలబడ్డాడు. అర్షద్ ఖాన్ (15), తెవాతియా (7), హోల్డర్ (7), రషీద్ ఖాన్ (7) ఔటైనా.. సుందర్ నిలబడడంతో గుజరాత్ జట్టు కష్టంగానైనా 150 దాటింది.

# చిల్లర రాజకీయాలు మానుకోవాలి



మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వ్యతిరేకం గా వెలిసిన ఫ్లెక్సీల ఉదంతాన్ని తాను తీవ్రం గా ఖండిస్తున్నాని, ఈ విషయంపై డీజీపీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ సీపీలకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇలా ఫ్లెక్సీ లు వెలువడం ఒక నాయకుడిపై వ్యక్తిగత దాడేనని, బీజేపీని చూసి ప్రత్యర్థులు భయపడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలిపారు. ఈటల రాజేందర్‌పై ఫ్లెక్సీల ఘటనను వారంతా ముక్తకంఠంతో ఖండించారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా మల్కాజిగిరిలో, సికింద్రాబాద్‌లో పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఆదివారం కలకలం రేపుతోంది. 'ఈటల నువ్వు బీజేపీలో చేరి చేసిందేంటయ్యా..? అని, బీజేపీలో చేరి గ్రూపులు కడుతున్నాడు? అని ఆ ఫ్లెక్సీల్లో గుర్తు తెలియని వ్యక్తు లు పేర్కొన్నారు. ఇతరులను ఎదగనీయకుం డా చేస్తున్నారని అందులో ఆరోపించారు. దీని పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు స్పందిస్తూ ఆదివారం ఒక వీడియోను విడుదల చేశారు. కొంతమంది బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పైన కొన్ని అభియోగాలతో మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్‌లో పెద్దపెద్ద ఫ్లెక్సీలను పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించా రు. బీజేపీకి రాష్ట్రంలో బలం పెరుగుతుండటంతోనే ఈ పనిని బీజేపీ వ్యతిరేకులు ఈ విధం గా చేశారన్నారు. బీజేపీ నాయకుల మధ్య ఐక్యత స్పష్టంగా కనబడుతుండటంతో బీజేపీని బలహీనపర్చాలనే ఉద్దేశంతోనే కొందరు వ్యక్తులు, కొన్నిపార్టీలు కలిసి చేస్తున్న పన్నాగమిదన్నారు. దీన్ని కుట్రగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. బీజేపీశ్రేణుల మధ్య విభేదాలు తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్న వారిని బీజేపీ హెచ్చరిస్తుందని తెలిపారు. ఇటువంటి చిల్లర రాజకీయాలను మానుకోవాలని, బీజేపీ నా యకులంతా ఐక్యంగా ఉన్నారని, తమకు ఎదురుగా వచ్చి రాజకీయం చేయలేని పార్టీలు ఇలా బీజేపీని బలహీన పర్చాలని చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై డీజీపీకి, మల్కాజ్‌గిరి కమిషనరేట్, సైబరాబాద్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తు జరగాలని, దీనివెనుక ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ని కించపరిచే విధంగా ఏర్పాటు చేసిన బ్యానర్లను- తెలంగాణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముక్తకంఠంతో ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది ఒక నాయకుడిపై వ్యక్తిగత దాడి మాత్రమే కాదని, తెలంగాణ బీజేపీ ఎదుగుదలను చూసి భయపడుతున్న ప్రత్యర్థి రాజకీయ శక్తుల ఓర్వలేని తనానికి నిదర్శనమన్నారు. ఈటల రాజేందర్ దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన సీనియర్ నాయకుడని, ప్రజా జీవితంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నేతని, అలాంటి వ్యక్తిని కించపరిచే ప్రయత్నం చేయడం నీచ రాజకీయాలకు పరాకాష్ఠ అన్నారు. ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేని అధికారపార్టీతోపాటు ప్రత్యర్థిశక్తుల పాత్రపై కూ డా సమగ్ర విచారణ జరగాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో బీజేపీ పూర్తిగా ఐక్యంగా ఉందని, ఇలాంటి కుట్రలు బీజేపీ ఐక్యతను దెబ్బతీయలేవని, ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈటల పై ఫ్లెక్సీల ఘటనను ఖండించిన వారిలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, కాటిపల్లి వెంకట రమణారెడ్డి, డాక్టర్ పాల్వాయిహరీశ్‌బాబు, రామరావు పటేల్, రాకేష్‌రెడ్డి, సూర్యనారాయణ, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, అంజిరెడ్డి, కొమరయ్య ఉన్నారు.

**యువత స్ఫూర్తి పొందేలా మోదీ 'మన్ కీ బాత్'**

యువత స్ఫూర్తి పొందేలా ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని దేశ యువత తప్పక చూడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 134వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్, కేఎంఐటీ లేన్ వద్ద పెరిక సురేష్ నివాసంలో పార్టీ నాయకులతో కలిసి రాంచం దర్‌రావు వీక్షించారు.

ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రతి 'మన్ కీ బాత్' ఎపిసోడ్ ద్వారా దేశానికి అవసరమైన అనేక స్ఫూర్తిదాయకమైన విషయాలను పంచుకుంటు న్నారని పేర్కొన్నారు. క్రీడల్లో మన క్రీడాకారులు కనబరుస్తున్న ప్రతిభ, వారు పడు తున్న కష్టం, వారి విజయగాథలు యువతకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా అథ్లెటిక్స్‌లో మనవాళ్లు సాధిస్తున్న అద్భుతమైన రికార్డులు భారతదేశ సత్తాను ప్రపంచానికి చాటుతున్నాయని కొనియాడారు. చారిత్రక అంశాల ను ప్రస్తావిస్తూ రాజరాజ చోళుని సముద్రయాన ఘనతను, సాహసాలను ప్రధాని గుర్తు చేయడం అభినందనీయమన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను, అలాగే మన సంప్రదాయ స్వదేశీ పానీయాలైన మామిడి పన్నా, సత్తు, సబ్జా గింజలతో తయారు చేసే రసాల ప్రాముఖ్యతను వివరించడం ద్వారా సామాన్య ప్రజలకు మేలు జరిగేలా ప్రధాని దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. 'మన్ కీ బాత్'లోని ప్రతి ఎపిసోడ్.. కొత్త సమాచారాన్ని, కొత్త స్ఫూర్తిని ఇస్తుందని, అందుకే ఈ కార్యక్రమాన్ని దేశ యువ త తప్పక చూడాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ పాటిల్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీరేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండలతో జాగ్రత్త!



(మొదటి పేజీ తరువాయి)

నదిలో ఆవాసం ఉండే గంగ డాల్ఫిన్ల జాతిని సంరక్షించడమే ప్రస్తుతం తమ ముందున్న కర్తవ్యమని తెలిపారు. అనారోగ్యం పాలైన డాల్ఫిన్లకు తక్షణ వైద్యం అందించేందుకు ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. తాజాగా ఓ డాల్ఫిన్‌కు వైద్యం చేసి కాపాడిన ఘటనను ప్రస్తావించారు. డాల్ఫిన్ జాతిని కాపాడుకోవడమంటే, కేవలం జీవులను రక్షించినట్టు కాదని, నదీ జీవ వైవిధ్యాన్నీ కాపాడినట్లని అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ఎంతో మంది పనిచేస్తున్నారని, వారందరికీ తన తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కేరళకు సజీ వలస్సేరిల్ అనే వ్యక్తి గురించి వివరించారు. పిల్లల కోసం సజీ ఉచిత స్విమ్మింగ్ క్లబ్ నడుపుతున్నాడని, దివ్యాంగ పిల్లలతో సహా ఇప్పటివరకు 15,000 మందికి ఈత నేర్పాడని కీర్తించారు. అంతేకాకుండా.. అన్ని వయస్సుల వారికి స్వయం రక్షణ నైపుణ్యాలు నేర్పుతున్నాడని కొనియాడారు. సమాజ సేవకు పెద్దగా వనరులు అవసరం లేదని, సహాయం చేయాలనే మంచి సంకల్పం ఉంటే చాలని ప్రధాని అన్నారు. అలాగే, ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాలోని మనోరమ నదిని పునరుజ్జీవం కోసం పనిచేస్తున్న ఆకాష్ గుప్తా, అతని బృందాన్ని ప్రస్తావించారు. ఈ బృందం నదిలో పేరుకుపోయిన గుర్రపుడెక్క మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నారని కొనియాడారు. గోవాకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాలకృష్ణ కృషిని కూడా ప్రధాని శ్లాఘించారు. బాలకృష్ణ మద్ది-తోలాప్ ప్రాంతంలో పైప్‌లైన్లు వేయించి, స్థానిక ఇళ్లకు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారని కీర్తించారు. అలాగే, క్రీడలు, సాంస్కృతిక వారసత్వం, సైన్స్ రంగాల్లో దేశం సాధిస్తున్న విజయాలను ప్రస్తావించారు. రాంచీలో ఇటీవల జరిగిన స్ప్రింటర్ ఫెడరేషన్ కప్ పోటీలో భారత క్రీడాకారులు గురీందర్ వీర్ సింగ్, అనిమేష్ కుజుర్‌ను అద్భుతమైన ప్రతిభ కనబరిచారని కొనియాడారు. ప్రధాని ఈ సందర్భంగా స్వయంగా వారికి కాల్ చేసి ప్రశంసల జల్లు కురిపించారు.



# మిల్లులు బంద్!

- 2 నెలలుగా వెంటాడుతున్న సమస్యలు
- ముంచుకొస్తున్న ప్రభుత్వ గడువు
- జూన్ 16 నాటికి 2024-25 రబీ బియ్యం అప్పగించాలని హుకుం
- వీలు పడదని తెగేసి చెప్తున్న రైస్ మిల్లర్లు

హైదరాబాద్, మే 31: రైస్ మిల్లులు.. సూటిగా చెప్పాలంటే.. గడిచిన రెండు నెలలుగా రాష్ట్రంలోని రైస్ మిల్లులు దాదాపుగా నిలిచిపో యాయి. ఎక్కడా ధాన్యం మిల్లింగ్ జరగడం లేదు. ప్రభుత్వం మాత్రం రైస్‌మిల్లు లు నడవకపోవడంపై దృష్టి పెట్టకుండా.. గడువులోగా బియ్యం సరఫరా చేయాల్సిందేనంటూ ప్రభుత్వం ఆదేశాలపై, ఆదేశాలు జారీ చేస్తోంది. దీనితో 25 శాతం పెనాల్టీ.. అదనంగా మరో 12 శాతం వడ్డీకి బలైపోతామంటూ రైస్‌మిల్లర్లు లబోదిబోమంటున్నారు. 'అసలు కూలీలు లేకుండా.. ధాన్యాన్ని మిల్లింగ్ చేయలేం. అలాగే లారీలు లేకుండా.. బియ్యాన్ని రవాణా చేయలేం. చివరగా.. గోదాముల్లో స్థలం లేకపోతే.. ఎఫ్‌సీఐ, సివిల్ సప్లలకు బియ్యాన్ని ఎలా దింపేది' అని మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. నిజానికి రాష్ట్రవ్యాప్తంగా కూలీల కొర త స్పష్టంగా కనపడుతోంది. రాష్ట్రంలోని సుమారు 4,500 లకుపైగా ఉన్న రైస్ మిల్లులకు కూలీలే ప్రధాన యంత్రాలు. కూలీలు లేకుండా.. రైస్ మిల్లులు నడవడం అనేది జరగదుగాక జరగదు. యూపీ, బీహార్, ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి కూలీలు వస్తుంటారు. అయితే ఈ సారి ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా కూలీలు సొంత రాష్ట్రాల నుంచి రావడం ఆలస్యం అయ్యింది. పైగా పూర్తి స్థాయిలో రాలేదు. వచ్చిన కూలీలు కూడా కేవలం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మాత్రమే వెళుతున్నారు. రైస్ మిల్లుల్లో, అలాగే ఎఫ్‌సీఐ, సివిల్ సప్ల గోదాముల్లో కూడా కూలీల కొరత వేధిస్తోంది. కేవలం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రం కూలీలు కనడుతున్నారు. దీనికి ప్రధా న కారణం.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఒక్కో బస్తా (40 కిలోలు)లో ధాన్యం నింపి, కాంటా పెట్టి, కుట్టి, లారీలోకి ఎక్కిస్తే.. రూ.25 వరకు ఇస్తున్నారు. అదే రైస్ మిల్లుల్లో మిల్లర్లు అయితే బస్తాకు రూ.10 మాత్రమే ఇస్తున్నారు.

# భారత్‌లో 'పాక్' దురంధర్‌లు!

(మొదటి పేజీ తరువాయి)

**శత్రుదేశంలోకి అక్రమంగా చొరబడతాడు..**

**స్థానికంగా పరిచయం పెంచుకుంటాడు..**

తరహాలో భారత్‌లో పాకిస్థానీ 'దురంధర్'లను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర భద్రతా, నిఘా వర్గాలు తెలిపాయి. జమ్మూకశ్మీర్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న తమ అనుచరులను భారత జాతీయ రాజకీయ పార్టీల్లో చేరాలని పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) ఆదేశించినట్టుగా గుర్తించామని వెల్లడించాయి. ఉగ్రవాదులతో సంబంధమున్న కొందరిని ఇటీవల శ్రీనగర్ పోలీసులు అరెస్టు చేసి, విచారించిన సమయంలో వారు జాతీయ రాజకీయ పార్టీల్లో సభ్యులుగా ఉన్నట్టుగా తేలిందని పేర్కొన్నాయి. స్థానికంగా ఉన్న పాత ఉగ్రవాద సంస్థలను పునరుద్ధరించేందుకూ ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిపాయి.


ఉగ్రవాద సంస్థలుగానీ, నిఘా సంస్థలుగానీ తమకు కీలకమైన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి అనుచరులను (ఓవర్ గ్రౌండ్ వర్కర్స్)ను ఏర్పాటు చేసుకుంటాయి. వారు ఎవరికీ అనుమానం రాకుండా స్థానికుల్లో కలిసిపోతారు. వారు నేరుగా పనిచేయరు. ఉగ్రవాదులు, గూఢచారులకు అవసరమైన డబ్బు, ఆయుధాలు, బస, ఇతర సహాయం అందిస్తారు. పాక్ ఐఎస్ఐ జమ్మూకశ్మీర్‌లోని ఇలాంటి అనుచరులను జాతీయ రాజకీయ పార్టీల్లో చేరాల్సిందిగా ఆదేశించినట్టు తేలిందని భద్రతా సంస్థల అధికారులు తెలిపారు. తనిఖీల సమయంలో, మరేదైనా కీలక సమయంలో భద్రతా దళాలకు తాము జాతీయ పార్టీల సభ్యులమని చెప్పి తప్పించుకునే వ్యూహం ఇది అని పేర్కొన్నారు. మరోవైపు 1990వ దశకంలో చురుకుగా పనిచేసి, తర్వాత మరుగున పడిన స్థానిక ఉగ్రవాద సంస్థలను పునరుద్ధరించి.. వాటి పేరిట స్థానిక యువతను రెచ్చగొట్టి చేర్చుకునే ప్రయత్నాలను కూడా ఐఎస్ఐ మొదలుపెట్టిందని చెప్పారు. ఆ ఉగ్రవాద సంస్థల పేరిట దాడులు చేయడం ద్వారా జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం భారత అంతర్గత, స్థానిక సమస్య అని చూపించే వ్యూహమని వివరించారు. ఇటీవలికాలంలో అల్ ఉమర్ ముజాహిదీన్, అల్ బద్ర్, తెహ్రీక్ ఉల్ ముజాహిదీన్ తదితర ఉగ్రవాద సంస్థల పేర్లు మళ్లీ తెరపైకి రావడం అందులో భాగమేనని స్పష్టం చేశారు. మొత్తంగా భారత్‌లో ఉగ్రవాదం విషయంలో పాక్ ప్రత్యక్ష ప్రమేయాన్ని దాచడం, భద్రతా సంస్థల నిఘా నుంచి తప్పించుకోవడం లక్ష్యంగా ఈ ప్రయత్నాలు చేస్తున్నట్టుగా గుర్తించామని వెల్లడించారు. ఈ పరిణామాలను కేంద్ర నిఘా సంస్థలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాయని పేర్కొన్నారు.

జమ్మూకశ్మీర్‌లోని ఉగ్రవాద గ్రూపులకు సాయపడేందుకు భారత సరిహద్దుల్లో లోపలి ప్రాంతాలకు కూడా సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందేలా పాకిస్థాన్ కుట్రలకు పాల్పడుతోందని అధికారులు తెలిపారు. ఇందుకోసం సరిహద్దుల వెంబడి భారీగా టెలికాం టవర్లు ఏర్పాటు చేసిందని.. వాటి నుంచి వచ్చే సంకేతాలు కథువా, రాజౌరి, పూంఛ్ వంటి సరిహద్దు జిల్లాలతోపాటు కరుడుగట్టిన ఉగ్రవాదులను ఉంచిన జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు ప్రాంతానికి కూడా చేరుతున్నట్టు గుర్తించామని వెల్లడించారు. పాకిస్థాన్ సిమ్‌కార్డులు, ఈ సిగ్నల్స్ ద్వారా పాక్‌లోని హ్యాండ్లర్లు భారత్‌లోని ఉగ్రవాదులు, అనుచరులకు మధ్య సందేశాల మార్పిడి జరుగుతోందని చెప్పారు. భారత నిఘాను తప్పించుకునేందుకు చైనా సాయంతో సీడీఎంఏ సాంకేతికతను, స్మార్ట్‌ఫోన్‌లను రేడియో సెట్లతో అనుసంధానించి వినియోగిస్తున్నారని తెలిపారు. కాగా, పాకిస్థాన్ ఐఎ?సఐ మద్దతుతో సామాజిక మాధ్యమాల ద్వారా భారత్‌లోని యువతను తప్పుదోవ పట్టిస్తున్న పాకిస్థాన్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ షహజాద్ భట్టిపై భద్రతా సంస్థలు నిఘా పెట్టినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

# రాత్రి వేళల్లో రహస్య గస్తీ... నేరస్తుల ప్రతి కదలికలపై..

### గార్ల-బయ్యారం పోలీసుల డేగ కన్ను

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల, బయ్యారం మండలం ప్రతినిధి) మే 31**



గార్ల డబయ్యారం. గంజాయి వ్యాపారం, మత్తు పదార్థాల రవాణా, దొంగతనాల నిర్మూలన లక్ష్యంగా గార్ల--బయ్యారం సర్కిల్ పోలీసులు రాత్రింబవళ్లు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. గార్ల--బయ్యారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్. రవీందర్ ఆధ్వర్యంలో, బయ్యారం ఎస్ఐ ప్రశాంత్ బాబు, గార్ల ఎస్ఐ సాయికుమార్‌లు సివిల్ డ్రెస్సులో ద్విచక్ర వాహనాలపై అనుమానిత ప్రాంతాల్లో రహస్య గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా గంజాయి సేవించడం, విక్రయించడం, రవాణా చేయడం వంటి అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి, మత్తు పదార్థాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సి.ఐ. ఎల్. రవీందర్ మాట్లాడుతూ, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగానికి పాల్పడే వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తామని హెచ్చరించారు. తెలిసి తెలియక మత్తు పదార్థాలకు బానిసైన యువతను డీ-అడిక్షన్ సెంటర్లు, కౌన్సిలింగ్ ద్వారా సన్మార్గంలో నడిపించేందుకు కూడా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, గంజాయి విక్రయాలు లేదా ఇతర నేర కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు. "ప్రజల భద్రతే మా లక్ష్యం... మత్తు పదార్థాల రహిత సమాజమే మా సంకల్పం" అని సి.ఐ. ఎల్. రవీందర్ తెలిపారు.



# 60 కిలోమీటర్లు ప్రయాణం... కోడెల కోసం గడ్డి తీసుకొచ్చిన భక్తులు

### నాగాయపల్లి దేవస్థానానికి పశుగ్రాసం విరాళం

**( కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మే 31 :**

వేములవాడ రూరల్ మండలం నాగాయపల్లి గ్రామంలోని శ్రీ దుబ్బ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కోడెలకు పశుగ్రాసంగా భక్తులు విరాళం అందజేశారు. ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన బాషవేని చంద్రయ్య--రాధ దంపతులు కుటుంబ సభ్యులు శ్రీనివాస్, స్వప్న (గుండ్లకుంట) కలిసి తమ వంతు సాయంగా 70 వరి గడ్డి కట్టలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దాతల సేవాభావాన్ని అభినందించారు. కోడెల సంరక్షణకు ఈ విరాళం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. దాతల కుటుంబాలకు స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

# పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నివారించాలి...

### జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 31.**



జగిత్యాల జిల్లాలో వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో రైతులు పంట అవశేషాలను ముఖ్యంగా వరి కొయ్యలను బహిరంగంగా కాల్చివేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూసారం తగ్గిపోతుందని, మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ కార్బన్, ఉపయోగకర సూక్ష్మజీవులు. వానపాములు నశించి భూమి సారవంతత క్షీణిస్తుందని పేర్కొన్నారు. పంట అవశేషాల దహనం కారణంగా మంటలు అదుపు తప్పి సమీపంలోని ఆయిల్ పామ్ తోటలు, మామిడి తోటలు మరియు ఇతర పంట పొలాలకు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. దీనివల్ల రైతులు గణనీయమైన ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో పొడి వాతావరణ పరిస్థితుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సమీప వ్యవసాయ భూములను దెబ్బతీసే అవకాశం ఉన్నందున రైతులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా, పంట అవశేషాల దహనం వల్ల సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు. విద్యుత్ సరఫరా తీగలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రజలు, రైతులు మరియు విద్యుత్ సిబ్బందికి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజా ఆస్తుల రక్షణ దృష్ట్యా రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను. పంట అవశేషాలను తగలబెట్టడం నిషేధించబడిందని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం రూ.5,000 నుండి రూ.25,000 వరకు జరిమానా విధించడంతో పాటు అవసరమైతే ఇతర చట్టపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులు పంట అవశేషాలను పొలంలోనే కలియదున్ని, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (యూరా) వంటి ఎరువులను వినియోగించడం ద్వారా వాటిని త్వరగా కుళ్లిపోయేలా చేసి సేంద్రియ ఎరువులుగా మార్చుకోవచ్చని సూచించారు. ఈ విధానం ద్వారా నేలలో పోషకాలు పెరిగి తదుపరి పంటలకు అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంట అవశేషాల శాస్త్రీయ నిర్వహణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, భూసార పరిరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణతో పాటు సమీపంలోని ఆయిల్పామ్, మామిడి తోటలు, ఇతర పంటలు మరియు విద్యుత్ మౌలిక వసతులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు పంట అవశేషాల దహనానికి పూర్తిగా దూరంగా ఉండాలని జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

# నిర్మల్ పోలీస్...మీ పోలీస్

### నిర్మల్ జిల్లా మొత్తం నాకబందీ, లాడ్జిల తనిఖీలు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 31(ప్రజాతీర్పు ):**



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నియమాల అమలు,ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిన్న రాత్రి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా జిల్లాలోని లాడ్జీలు, దాబాలు, ప్రధాన కూడళ్లు, రహదారులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల పరిసర ప్రాంతాలు, ఇతర కీలక ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి పరిశీలించారు. లాడ్జీలు,దాబాల నిర్వాహకులకు తమ వద్దకు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలు నమోదు చేయాలని, సీసీ కెమెరాలు తప్పనిసరిగా పనిచేసేలా చూడాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఎటువంటి సంఘ వ్యతిరేక, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అవకాశం కల్పించరాదని హెచ్చరించారు. అదేవిధంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో నాకాబందీ నిర్వహించి వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్ వివరాలు తనిఖీ చేశారు. నెంబర్ ప్లేట్లు లేకుండా నడిపే వాహనాలు, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే నేరగాళ్లు, సంఘ వ్యతిరేక శక్తులు, అనుమానాస్పద కదలికలను అరికట్టేందుకు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నాకాబందీలు నిరంతరంగా కొనసాగుతాయని,శాంతియుత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్ 100 కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల సూచించారు. ఈ విస్తృత తనిఖీల్లో నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్,ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.



# కరాటే గ్రేడింగ్‌లో వేములవాడ విద్యార్థుల ఘనత

- 10 మందికి బ్లాక్ బెల్ట్ • 3 బ్రౌన్ బెల్టులు కైవసం
- సిపీ గౌస్ ఆలం ప్రత్యేక అభినందనలు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు,వేములవాడ) మే 31:**

ఉమ్మడి జిల్లా స్థాయి బ్లాక్ బెల్ట్ కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో వేములవాడ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటారు. కరీంనగర్ పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో శనివారం సాయంత్రం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. వేములవాడ ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ అబ్దుల్ మన్నన్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ పరీక్షల్లో అద్భుత ప్రదర్శన చేశారు. మొత్తం 10 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక 'బ్లాక్ బెల్ట్' సాధించగా, మరో ముగ్గురు విద్యార్థులు 'బ్రౌన్ బెల్ట్' కైవసం చేసుకున్నట్లు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ కే. వసంత్ కుమార్ వెల్లడించారు. పోలీస్ కమిషనర్ కరాటే గ్రేడింగ్‌లో ఘన విజయం సాధించిన వేములవాడ విద్యార్థులను కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ విద్యలు ఎంతో అవసరమన్నారు. కరాటే నేర్చుకోవడం ద్వారా యువతలో క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం, ఆత్మస్థైర్యం పెంపొందుతాయని ఆయన కొనియాడారు. విద్యార్థులు ఇలాగే రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బ్లాక్ బెల్ట్ సాధించిన వారిలో మొహమ్మద్ అబ్దుల్ ఫర్హాన్ అబ్బాసి, పి. భాస్కర్, కే. సాయి మణిరూప్, కె. సాయి మణి హర్షిత్, ఎస్. కె. షరీన్, ఎస్. కె. తన్ హజ్, సి.హెచ్. సూర్య సుశీల్, వి. శివహిత్, వి. షిరిహాస్, మరియు జి. వివేకా శ్రీ. బ్రౌన్ బెల్ట్ సాధించిన వారు: పి. జానవి, పి. వర్షిత్ కుమార్, సిద్దు ఉన్నారు.

ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు, శిక్షకులు పుల్లూరి శ్రీనివాస్, మరిపల్లి శ్రీనివాస్, కనికరపు రాజశేఖర్, కే. రాజశేఖర్ తదితరులు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్టులను అందజేసి అభినందనలు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను జూన్ 2 నుండి అమలుచేయాలి

- నోముల భానుచందర్ ప్రగతిశీల యువజన సంఘంపి వై ఎల్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి

**(పొనకంటిఉపేందర్ రావు. ప్రజాతీర్పు టేకులపల్లి) మే 31**



టేకులపల్లి :తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమకారులకు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను తక్షణమే అమలు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు హైకోర్టులో ప్రభుత్వం పై కేసు వేసిన సందర్భంగా తక్షణమే ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని హైకోర్టు తీర్పునివ్వడం జరిగింది. దీనికి సంబంధించి 8(ఎనిమిది) వారాల గడువు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఇవ్వడం జరిగింది. హైకోర్టు తీర్పులో ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు(ప్లాట్ ), పెన్షన్ తదితర ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆదేశించడం జరిగింది. కావునా హైకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజమైన ఉద్యమ కారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.




# లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి సౌజన్యంతో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోరం

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) మే 31**

టేకులపల్లి :లయన్స్ క్లబ్ అఫ్ ఇంటర్నేషనల్ వారి ఆర్థిక సహకారంతో, లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి ఆధ్వర్యంలో విద్యాభివృద్ధి మరియు బాలికల ప్రోత్సాహం లక్ష్యంగా పలు పాఠశాలల విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇల్లందు.ఎమ్మెల్యే కోరం కనకయ్య. మాట్లాడుతూ విద్యార్థినులకు సైకిళ్లను అందజేసి, వారి విద్యాభ్యాసంలో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు పాఠశాలకు సులభంగా చేరుకోవడానికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగిలాల్ పలువురు పార్టీ నాయకులు శగణేష్, ఇస్లావత్ రెడ్డి నాయక్, సంజయ్, నర్సింగ్ లక్ష్మయ్య తదితరులు పాల్గొని విద్యార్థినులను అభినందించారు.లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి అధ్యక్షులు కేశ వేణుగోపాలరావు మాట్లాడుతూ, సమాజ సేవే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని, విద్య, ఆరోగ్యం మరియు సామాజిక సంక్షేమ రంగాల్లో క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. క్లబ్ కార్యదర్శి తోటకూర సందీప్ కుమార్ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించి, లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ట్రెజరర్ దుర్గారావు, వీరభద్రం మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బొడ్డుపల్లి బ్రహ్మాచారి. అరేం నర్సయ్య(బాబు) డాక్టర్ పొనకంటిఉపేందర్ రావు బండ్ల శ్రీనివాస్, శ్రీమతి బండ్ల రజిని, అంబాల బాలయ్య, శ్రీమతి అంబాల మయూరి తదితరులు సేవాభావంతో కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విద్యార్థినులకు ప్రోత్సాహాన్ని అందించారు.ప్రజాప్రతినిధులు, నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజల సమక్షంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. విద్యార్థినుల విద్యాభివృద్ధికి, వారి భవిష్యత్ ఉన్నతికి తోడ్పడే ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. సేవే మా ధ్యేయం -- విద్యార్థుల అభివృద్ధియే మా లక్ష్యం" అనే నినాదంతో లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి సమాజ సేవలో ముందంజలో నిలుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని సంకల్పించింది.



# పుస్తాకన్ని అవిష్కరించిన ఎస్సీ , ఎస్టీ ఉపాధ్యాయ సంఘనాయకులు

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 31**

సర్వ మానవ కళ్యాణము కొరకు ఉద్దేశించి భగవాన్ బుద్ధుడు బౌద్ధ దమ్మం మానవాళికి అందించారు. ప్రపంచంలో ఏ ధర్మము కూడా చెడుని ప్రబోధించదు.అన్ని ధర్మాలు సమాజ శ్రేయస్సు కోసమే ఏర్పడ్డాయి. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ధర్మాబాద్ నివాసి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు టిజి తురే,రచించిన "పౌర్ణమిచా ప్రకాశాత్ బుద్ధాచే జీవన్"పుస్తకావిష్కరణ భైంసా పులే నగర్ లో ఏర్పాటు చేసినకార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ధర్మాజీ చందనే,మాట్లాడుతూ తథాగతుడు ప్రపంచంలోని అనంత కోటి జీవరాశికి శాంతి,సుఖము కలగడానికి కోసం దుఃఖము నుండి ముక్తి పొందడానికికోసముమార్గాన్ని అన్వేషణలోస ఫలీకృతమయ్యారు. ఆమహనీయుని జీవిత చరిత్ర ని ఈ పుస్తకంలో రచించారని తెలియజేశారు. ఈ సందర్భంగా టీజీ తురేని, ఘనంగా సత్కరించి ఆయన చేసినకృషినిఅభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రజ్ఞ ఎంప్లాయిస్ అసోసియేషన్ భైంసా అధ్యక్షులు భీమ్ రావు వాగ్మరే,మరియు ప్రధాన కార్యదర్శి సురేష్ పట్టెరావు, మరియు భైంసా డివిజన్ ఉద్యోగులసంఘం అధ్యక్షులు లక్ష్మణ్ జడే,బౌద్ధఉపాసకులు పాండురంగ జాదవ్, పాల్గొన్నారు.

# చిన్నారున్ని ఆశీర్వదించిన మంత్రులు

**మంథని, మే 31 (ప్రజాతీర్పు)**



పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జీ ఆరెల్లి కిరణ్ గౌడ్-లావణ్య దంపతుల కుమారుడు శ్రీహాన్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిన్నారున్ని ఆశీర్వదించారు. మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన ఆరెల్లి కిరణ్ గౌడ్- లావణ్య దంపతులు తమ కుమారుడు శ్రీహాన్ పుట్టినరోజు సందర్భంగా ఆశీర్వాదాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రులు చిన్నారుడు శ్రీహాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆరెల్లి కిరణ్ గౌడ్ దంపతులు మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# తెలంగాణ ఆక్రమణకు మళ్ళీ జరుగుతున్న కుట్రలను తిప్పి కొడదాం

- తెలంగాణలో ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాటం మిగిలే ఉంది.
- మెంతెన సంజీవరావు, టి పిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.



**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) మే 31**

టేకులపల్లి :ఆదివారం తెలంగాణ అమరవీరుల వారోత్సవాలల్లో భాగంగా నేడు తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడిఖమ్మంజిల్లాకమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లిలోని కొమరం భీమ్ విగ్రహ.కూడలి మరియు, బోడు సెంటర్ లవద్ద జిల్లా అధ్యక్షులు రామటెంకి అశోక్అధ్యక్షతన కరపత్రాలు విడుదల చేసిన అనంతరం తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెంతెన సంజీవరావుపాల్గొని ప్రసంగించారు.

### తెలంగాణ రాష్ట్రంలో మరలా

ఆంధ్రా కేంద్రీత రాజకీయ శక్తుల ప్రయోగశాలగా మార్చడానికి కేంద్ర ,రాష్ట్ర పాలకులు ఉమ్మడిగా పథకం ప్రకారం కుట్రలు పన్ను తున్నారని- ఒక పథకం ప్రకారంగాతెలంగాణ సాంస్కృతిక, రాజకీయ పునరాక్రమనకు తెర తీసినట్లుగా స్పష్టమవుతుందని సంజీవరావు స్పష్టం చేశారు.తెలంగాణలోని ప్రజాస్వామిక ఆకాంక్ష పరులు పోరాటంలో,విద్యార్థులు, యువజనలు, అశేష ప్రజలు ఎంతోమంది పోరాడుతూ రక్తం చిందించి, బలిదానాలు చేసుకొని నిర్మించుకున్న, సాధించు కున్న తెలంగాణలో తెలంగాణ విభజనను- భావజాలాన్ని, తెలంగాణ అస్తిత్వాన్ని, అంతమొందించే నిశ్శబ్ద కుట్రను తెలంగాణ ప్రజలు విజ్ఞతగా పరిశీలిస్తూ ప్రజలను ప్రజాస్వామిక తెలంగాణ సాధన వైపు సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.తెలంగాణ పోరాట చరిత్ర మన తాతలు రైతాంగ సాయుధ పోరాటంలో ముందున్నారు. మన తండ్రుల తరానికి1969 పోరాటంలోను, తదనంతరం వెల్లువలా వచ్చిన నక్సల్బరీ పోరాటంలోనూ పాల్గొని ఎంతోమంది అమరత్వం పొందిన చరిత్ర తెలంగాణది. మన తరం మలిదశ, తుది దశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ముందుండి సుమారు 1500 వందల మంది వరకు ప్రాణాలు త్యజించి భౌగోళిక తెలంగాణను సాధించుకున్నాం. ఐనప్పటికీ జరుగుతున్న పరిణామాలన్నీ నిశితంగా పరిశీలిస్తే ప్రజాస్వామిక తెలంగాణ కోసం కొట్లాడాల్సిన కర్తవ్యం మిగిలే ఉందని సంజీవరావు పేర్కొన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలనితెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర విభజనపై,అస్తిత్వం పై జరుగుతున్న దాడులను ఖండించాలని, మేధావులు బుద్ధిజీవులు, ప్రజాస్వామిక తెలంగాణ వాదులపై జరుగుతున్న ఎన్. ఐ. ఏ దాడులు ఆపాలని పేర్కొన్నారు. అంతిమంగా తెలంగాణలోని మూడున్నర కోట్ల ప్రజలుప్రజాస్వామిక తెలంగాణకై తెగించి కొట్లాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ క్రమంలోనే తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్రస్థాయిలో తెలంగాణ అమరుల స్మారకార్థం నిర్వహించ తలపెట్టిన జూన్ 2 తెలంగాణ ఆవిర్భావం నాటి సదస్సును ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు రామటెంకి అశోక్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు దుగారపు వీరభద్రం,జిల్లా నాయకులు కొప్పుల గీతారెడ్డి, బానోత్ లక్పతి,వట్టం నాగేందర్, ఆరెం వీరయ్య, మాలోతు వసంతరావు, ఐ లక్ష్మణ్, గుగులోతు వస్త్రాం, అరెం నాగరాజు, జహంగీర్ ఖాన్,పి బాలకృష్ణ, అలేం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్యానికి పరుగే ఉత్తమ మార్గం. ఐసీసీసీ ఇన్స్పెక్టర్ దుబ్బ కిషన్.

**బోడుప్పల్ సర్కిల్, మే 31 ( ప్రజాతీర్పు )**

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పరుగెత్తడం ఎంతో ఉపయోగకరమని ఇంటెలిజెన్స్ ఐసీసీసీ ఇన్స్పెక్టర్ దుబ్బ కిషన్ తెలిపారు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు రన్నింగ్ లేదా వాకింగ్ చేస్తే ఆసుపత్రుల దారి పడాల్సిన అవసరం ఉండదని ఆయన స్పష్టం చేశారు.చెంగిచెర్ల శాంతివనం రన్నర్స్ గ్రూప్ సభ్యుడైన దుబ్బ కిషన్, మే నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు నిరంతరం ప్రతి రోజు 21.1 కిలోమీటర్ల పరుగును పూర్తి చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ ఘనత సాధించిన సందర్భంగా ఉప్పల్ భగాయత్‌లో ఎల్బీనగర్ రన్నర్స్ మరియు ఉప్పల్ రన్నింగ్ గ్రూప్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. దుబ్బ కిషన్ (ఐసీసీసీ ఇన్స్పెక్టర్) మాట్లాడుతూ, “నేను 2012 సంవత్సరం నుండి రన్నింగ్ ప్రారంభించాను. 2021లో ఎయిర్టెల్ మారథాన్‌తో పోటీ పరుగు ప్రారంభమైంది. ఇప్పటి వరకు 12 ఫుల్ మారథాన్‌లు (42.192 కిలోమీటర్లు), 25 హాఫ్ మారథాన్‌లు పూర్తి చేశాను. ఈ సంవత్సరం మే 1 నుంచి 31 వరకు మొత్తం 31 రోజుల పాటు ప్రతి రోజు 21.1 కిలోమీటర్ల పరుగును పూర్తి చేయగలిగాను. ఈ ప్రయాణంలో శాంతివనం రన్నర్స్ గ్రూప్ సభ్యుల ప్రోత్సాహం ఎంతో కీలకం. నా ఈ ప్రయత్నాన్ని చూసి మరికొందరు అయినా పరుగు ప్రారంభిస్తారని ఆశిస్తున్నాను. అయితే, ఎవరి ఆరోగ్య పరిస్థితులు వారికి తెలుసు కాబట్టి, తమ సామర్థ్యానికి తగ్గట్టుగా మాత్రమే పరుగు చేయాలి” అని తెలిపారు.

## పార్వతిబైరయ్య సొంత నిధులతో సీసీ కెమెరాలు, మైక్ సౌండ్ ప్రారంభించిన ఎమ్మెల్యే హరీష్

**సిద్దిపేట మే31(ప్రజా తీర్పు ప్రతినిధి)**



సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంట కాలనీలో బీఆర్ఎస్ నాయకులు పార్వతిబైరయ్యల తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, కాలనీ మొత్తం ప్రజలకు ఉపయోగపడే మైక్ సౌండ్ వ్యవస్థను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ప్రారంభించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని పార్వతిబైరయ్య తమ సొంత నిధులతో సీసీ కెమెరాలు, మైక్ సౌండ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజాసేవ పట్ల వారి నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. కాళ్లకుంట కాలనీ అభివృద్ధి కోసం పార్వతిబైరయ్య నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం ముందుండి పనిచేస్తున్నారని కొనియాడారు. కాలనీలో భద్రతను మరింత మెరుగుపరచడంతో పాటు అత్యవసర సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో ఈ సౌండ్ వ్యవస్థ, సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు.అనంతరం రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడిన హరీష్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, రూ.4,000 పెన్షన్, తులం బంగారం వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ పెద్దలు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్వతిబైరయ్య సేవలను కాలనీ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

# ఎండపల్లి మండల కేంద్రం లోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలి

- మంత్రి లక్ష్మణ్ కుమార్ మానవతా దృక్పథంతో పునరాలోచించాలి
- వేరే గ్రామానికి తరలించే యోచన మానుకోవాలి
- గ్రామ సర్పంచ్ మారం సునీత-జలంధర్ రెడ్డి
- మండల తహసిల్దార్ కార్యాలయం ముందు భారీ ధర్నా, రాస్తారోకో

**(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి), మే 31:**



జగిత్యాల జిల్లాలో ఎండపల్లి మండల కేంద్రానికి గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరిపడా ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని అనివార్య కారణాలవల్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండపల్లి మండల కేంద్రానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సమీపంలోని రాజరాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేయడానికి జూన్ 1 సోమవారం భూమి పూజ చేయడానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమాయతమయ్యారు. దీంతో ఆదివారం ఎండపల్లి గ్రామ సర్పంచ్ మారం సునీత-జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కలిసి మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఎండపల్లి లోనే ఆసుపత్రి నిర్మించాలని రాష్ట్ర రహదారిపై భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీతా రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కెసిఆర్, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎండపల్లి మండల ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా మండల కేంద్రాల మంజూరి తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించారని, కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దర్పంతో ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా ఎండపల్లిలో కాకుండా రాజారాం పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించడానికి సిద్ధపడటం సబబు కాదని అన్నారు. రాజారాం పల్లి లో ప్రభుత్వ స్థలం లేకపోయినప్పటికీ ఎండపల్లిలో ఆసుపత్రి నిర్మాణం జరగకూడదనే అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు దురుద్దేశంతో ప్రైవేటు వ్యక్తుల భూమిని విరాళంగా సేకరించి ఆసుపత్రి నిర్మాణం చేపట్టడమే కాకుండా శిలాఫలకంపై రాజారాం పల్లి సర్పంచ్ తో పాటు తన పేరు సైతం చేర్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయమై ఇదివరకే ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందజేశానని, మండల తహసిల్దార్ కార్యాలయంలో పలుమార్లు విజ్ఞప్తి చేశానని అయినా అధికారులు స్పందించలేదని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మానవతా దృక్పథంతో పునరాలోచించి ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న ఎండపల్లి మండల కేంద్రంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఎండపల్లి సర్పంచ్ తో పాటు గ్రామస్తులంతా కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎలేటి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ దాసరి కళ్యాణి- కొమరయ్య, నాయకులు తనుగుల జగతి గౌడ్, సంపతి సతీష్ యాదవ్, దేవి రవీందర్, గుర్రం శంకరయ్య, సంపతి స్వామి యాదవ్, ముస్కు రాజేశ్వర్ రెడ్డి, వర్ధవెల్లి సాయి, నస్పూరి రాజేశం, మంతెన చంద్రయ్య, మంతెన ప్రశాంత్, గౌరయ్య, పాములపర్తి సురేష్, దొనకొండ శోభ, తోడేటి రాజయ్య, భాగ్యలక్ష్మి, ఎండపల్లి గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయి..

ప్రముఖ కవయిత్రి అయిత అనిత...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 31.**

కళా, సాహిత్య రంగాల సేవలకు అందించే అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయాని ప్రముఖ కవయిత్రి అయిత అనిత అన్నారు. ఆదివారం స్థానిక విశ్వ గాయత్రి జ్ఞాన మందిరంలో శాతవాహన కళా స్రవంతి, అభినయ కళానికేతన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రముఖ రంగస్థల నటుడు స్వర్గీయ సిద్దార్థ స్రవంతి స్మారక అవార్డ్ ల కార్యక్రమంలో దాదాపు రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న 20 మందికి సిద్దార్థ స్రవంతి స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు మురళి మధు, శుభ ఆలపించిన పాటలు ప్రేక్షకులను అలరించాయి. వై ఎస్ శర్మ, కొమురవెల్లి లక్ష్మీనారాయణ, కళాశ్రీ అధినేత గుండేటి రాజు, న్యాయవాది సుబ్రహ్మణ్యం, వేణు ఆర్టిస్ట్, చారి, అశోక్ గుప్త, సంపత్ కుమార్, కొమురవెల్లి లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



## పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 31**

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని దేగం గ్రామంలో పౌర్ణమి సందర్భంగా శ్రీ దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో భాగంగా ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పుండలిక్,పాటిల్ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు బీజెపీ పీ నాయకులు భక్తులు మరియు పార్టీ నాయకులుపాల్గొన్నారు.



## 134వ మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 31**

ఈ రోజు స్థానిక భైంసా పట్టణం భైంసా జీన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో నిర్వహించిన”134వ మన్ కీ బాత్” కార్యక్రమాన్ని ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్ అదే విధంగా వారి యొక్క ప్రజా ట్రస్ట్ లైబ్రరీ విద్యార్థులు ఆసక్తిగా వీక్షించి, కార్యక్రమంలోపాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజా ట్రస్ట్ చైర్మన్ గారు మాట్లాడుతూ ప్రధానమంత్రి గారి సందేశాలు దేశ అభివృద్ధికి మరియు సమాజ అభివృద్ధికి, యువతలో స్ఫూర్తిని నింపేందుకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.ప్రజలు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలోభాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



## ఉద్యోగులు స్థానిక నివాసం ఉంటూ సేవలు అందించాలి

- ఏజెన్సీ అలవెన్సులు తీసుకుంటూ రాకపోకలు సాగించటం ఏమిటీ...?

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) మే 31**

గార్ల.. మండల పరిధిలో పనిచేస్తున్న సమస్త శాఖలలో ఉద్యోగులు ఏజెన్సీ ఏరియాలో స్థానిక నివాసములు ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని ప్రజాతంత్ర వాదులు కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తూ.. ఆ ప్రజలకు సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ఏజెన్సీ అలవెన్సును ప్రభుత్వం మంజూరు చేస్తున్నది. కానీ మండలంలో 10 శాతం తప్ప 90 శాతం మంది ఉద్యోగులు దూర ప్రాంతాల నుంచి బస్సుల ద్వారా రైళ్ల ద్వారా రాకపోకలు నిర్వహిస్తూ ఏజెన్సీ నిబంధనలకు తూర్పు పొడుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రయాణములో ట్రైన్స్ లేట్ అయిన, బస్సులు లేట్ అయిన కాలయాపనతో ఆయా శాఖలు కొనసాగుతున్నాయి. వైద్య ఆరోగ్య జిల్లా శాఖ ఎన్నో పర్యాయాలు మండల వైద్య ఆరోగ్య సిబ్బందికి స్థానిక నివాసం ఉండి సకాలంలో విధులు నిర్వర్తించాలని చెప్పినా, సిబ్బంది పెడచెవిన పడుతూ ఏమి చేయలేరులే అన్నట్లుగా కొనసాగుతున్నారు. ఏజెన్సీ అలవెన్సులు తీసుకుంటూ, స్థానిక నివాసం ఉండకుండా దూర ప్రాంతాల నుంచి రాకపోకలు నిర్వహిస్తున్న మండల ఉద్యోగులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జనాలు కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం స్థానిక నివాసం ఉండని సిబ్బందిపై కొరడా ఝులిపించాలని ఏజెన్సీ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



# ఆదివాసుల సమస్యలను పరిష్కరించాలి

- తెలంగాణ రైతు సంఘం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 31**

నిర్మల్ జిల్లా పెంబి మండల ఆదివాసులు కొనసాగిస్తున్న నిరసన దీక్ష శిబిరాన్ని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి మండల కార్యదర్శి పల్లికొండ శ్రీనివాస్,ఖానాపూర్ మండల ఉపాధ్యక్షులు నాగుల నర్సాగౌడ్,సందర్శించి మద్దతు తెలిపారు. ఆదివాసులు జీవించే హక్కును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు,కాలరాస్తున్నాయి.టైగర్ జోన్ పేరుతో గిరిజన గ్రామాలకు కరెంటు, రోడ్డు, మంచినీరు, ఎలాంటి సౌకర్యాలు లేకుండా పరిపాలన కొనసాగిస్తున్నాయిదీన్ని ప్రజలు ప్రజాస్వానికి వాదులు అందరూ వ్యతిరేకించాలని కోరారు. వారంరోజులుగాకొనసాగుతున్న,ఆదివాసుల నిరసన దీక్షకు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం నుండి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. పాలకులకు ఎన్నికలసమయంలోనే ప్రజలుగుర్తుకువస్తారు. దశాబ్దాలతరబడి ఆదివాసిగూడలలో నివసిస్తున్నటువంటి వారికి మంచినీటి సౌకర్యం కూడాసరిగాలేకపోవడం.దుర్మార్గం.త్రి ఫేస్ కరెంటు ఇవ్వకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టకుండా.పోడు భూములలో పట్టా భూములైనప్పటికిని బావులు తవ్వుకోవడానికి వీలు లేకుండా ఆటవిశాఖ అధికారులు ఆంక్షలు విధించడాన్నీ తీవ్రంగా వ్యతిరేకించారు.వెంటనే ఈ సౌకర్యాలని మౌలిక వసతులను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దీక్షా శిబిరంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు మండల నాయకులు నిర్మల భాయ్ ఉపసర్పంచ్ పగ్గు,తదితరులు పాల్గొన్నారూ.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

**బీర్పూర్ మే 31 (ప్రజా తీర్పు)**

జగిత్యాల జిల్లా బిర్పూర్ మండలం తుంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరంలో పదవ తరగతి వరకు విద్యనభ్యసించిన విద్యార్థిని విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఆనాటి మధుర స్మృతులను మరొక సారి వారి బాల్య జీవితాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అలనాటి ప్రధానోపాధ్యాయులు చెరుకు రాజన్న,ఉపాధ్యాయులు ఎనగందుల కైలాసం, కందుకూరి శ్రీనివాస్, జీవన్,దోసారపు విజయ్, పొన్నమల్ల ప్రభాకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా సర్పంచ్ అర్షకోట రాజగోపాల్ రావు,ఉపసర్పంచ్ శీలం లింగన్న హాజరయ్యారు.



# కాంగ్రెస్ పార్టీ పదవుల్లో పద్మశాలీయులకు అన్యాయం

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 31**

ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మరియు మంచిర్యాల జిల్లాలో ని మండల అధ్యక్ష పదవులలో, పట్టణ మున్సిపాలిటీ అధ్యక్ష పదవులలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా పద్మశాలి సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఈరోజు మంచిర్యాల జిల్లా కేంద్రంలో సమావేశమైన శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మరియు మంచిర్యాల జిల్లాలో 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో, గ్రామ పంచాయతీ , మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పద్మశాలి సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు తీవ్ర స్థాయిలో కృషి చేసినారని అయినప్పటికీ ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన జిల్లా కమిటీ లలో కానీ , మండల అధ్యక్ష పదవుల్లో కానీ, పట్టణ కార్పొరేషన్ అధ్యక్ష పదవుల్లో కానీ పద్మశాలీయులకు సరి అయిన ప్రాతునిధ్యం కలిపించకపోవడం శోచనీయం అని సమావేశం పేర్కోనది . అదే విధంగా 1978 నుండి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ని గ్రామ స్థాయి నుండి మండల , పట్టణ, జిల్లా , రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ ఉద్యమ కరుడిగా తాటిపాముల నాగయ్య , పసుపునూరి రంగయ్య ,జంజీరాల రాజం , మీసాల నర్సయ్య లాంటి ఎందరో నాయకులు తమ చివర శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసినారనే విషయాన్ని రాష్ట్ర జిల్లా ల నాయకత్వం విశ్వరించడం చాన బాధాకరం అని ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ పెద్దలు , జిల్లా , మండల , మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ పదవులలో సముచిత స్థానం కల్పించే విధంగా కృషి చేయాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. లేని యెడల రాబోయే గ్రాజ , వీుజ ఎన్నికలలో పద్మశాలీయుల సత్తా ఏమిటో కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా జై మార్కండేయ జై జై బీసీ పద్మశాలీయులారా ఏకం కండి రాజ్యాధికారం లో వాటా కోసం , సామాజిక న్యాయం కోసం అని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ యొక్క సమావేశంలో మంచిర్యాల జిల్లా శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ, తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు మరియు బీసీ సంఘాల నాయకుడు గజెల్లి వెంకటయ్య , పద్మశాలి సంఘం నాయకులు వేముల అశోక్ , చిప్ప రామస్వామి , జంజీరాల నారాయణ , అడిచర్ల రాజేశం , పరిసె శ్రీనివాస్ , డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 31**

రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని చెన్నూర్ మండలం ఒతుకులపల్లి, ఆస్నాద్, సోమనపల్లి లలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, చెన్నూర్ మండల కేంద్రంలోని గోదామును మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ పోలీస్.. మీ పోలీస్

- నిర్మల్ జిల్లా వ్యాప్తంగా రేపటి నుండి 30 పోలీస్ యాక్ట్ అమలు
- ముందస్తు అనుమతి లేకుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిషేధం
- జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 31(ప్రజాతీర్పు ):**



నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతత ను పెంపొందించేందుకు ఈ నెల 01 నుండి జూన్ 30 వరకు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఉత్తర్వుల ప్రకారం జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు,ధర్నాలు జరుపరాదు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జనసమూహం పోగు అవుట వంటివి నిషేధం. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్ స్పీకర్ లు, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో నిషేధము.నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులు అవుతారని ఎస్పీ పేర్కొన్నారు.

# చేపల వేటకై కరెంటు వాడి వ్యక్తి మృతి

**బీర్పూర్ మే31 ప్రజా తీర్పు**



బీర్పూర్ మండలం లోని చిత్రవేణిగూడెం కి సంబంధించిన చిక్రం సాగర్ మరియు అదే గ్రామానికి చెందిన ఇంకో నలుగురు వ్యక్తులు శనివారం మధ్యాహ్నం కమ్మునూర్ శివారు లో గోదావరి నది లో చేపల వేట కై వెళ్లి , సమీప ట్రాన్స్ఫార్మర్ నుండి కరెంటు తీగలు వాడి చేపలు పట్టే క్రమం లో నిర్లక్ష్యంగా అజాగ్రతగా ఉండటం వల్ల కరెంటు సరఫరా ఉన్న తీగ పై జారి పడటం వల్ల చిక్రం సాగర్ మరణించినట్టు మృతుని భార్య ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. నేర స్థలాన్ని జగిత్యాల రూరల్ సీఐ దామెర సుధాకర్ పరిశీలించి ఎస్ ఐ దర్యాప్తు తెలిపారు.

# సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు జగన్ కు స్వాగతం పలికిన మంచిర్యాల డిపిఆర్ఓ

**(వి,వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) మే 31**



ఆసిఫాబాద్ జిల్లాలో జూన్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మంచిర్యాలకు విచ్చేసిన సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు జగన్ గారికి స్వాగతం పలికిన మంచిర్యాల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కృష్ణమూర్తి.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభకు నిదర్శనం..

## బాసర ఐఐఐటీలో 8 మందికి సీట్లు

**రామడుగు, మే 31 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందనడానికి రామడుగు మండల విద్యార్థులు మరోసారి నిదర్శనంగా నిలిచారు. ఆర్థిక, సామాజిక పరమైన అనేక సవాళ్లను అధిగమించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రతిష్ఠాత్మకమైన ఐఐఐటీ బాసర (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్)లో ప్రవేశానికి ఎంపిక కావడం మండలానికి గర్వకారణంగా మారింది. ఈ విద్యా సంవత్సరంలో రామడుగు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మరియు టీజీ మోడల్ స్కూల్‌లకు చెందిన మొత్తం 8 మంది విద్యార్థులు ఐఐఐటీ బాసరలో సీట్లు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. వీరి విజయంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలు మరోసారి రుజువయ్యాయి. జడ్పీహెచ్ఎస్ రుద్రారం పాఠశాల నుంచి వేముల శ్రీ చరణ్, పల్లి ప్రణయ్, రంగు సుస్మిత, నిట్టు సిద్దు, చిలుముల అవంతికలు ఎంపిక కాగా, జడ్పీహెచ్ఎస్ రామడుగు నుంచి మొగుళ్ళ పూజ, అలాగే టీజీ మోడల్ స్కూల్‌కు చెందిన కడారి శైలజ, చిలుముల అశ్వితలు ప్రవేశానికి అర్హత సాధించారు. విద్యార్థుల ఈ విజయాల వెనుక ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నిరంతర కృషి, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల పట్టుదల కీలక పాత్ర పోషించాయని మండల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ బోధన, నైపుణ్యాధారిత విద్య, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల ఫలితంగానే విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణిస్తున్నారని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరగడానికి ఇటువంటి విజయాలు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఐఐఐటీ బాసరలో ప్రవేశం పొందిన విద్యార్థులను మండల విద్యాధికారి రంగనాథ శర్మ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకుని మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ యూనియన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి!

- బోడుప్పల్లో 380వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల.
- సెంట్రింగ్ యూనియన్ సభ్యుల అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ భవన నిర్మాణ కార్మికుల నిరసన ధర్నా.
- బోడుప్పల్ భవన నిర్మాణ కార్మిక సంఘం చైర్మన్, నత్తి మైసయ్య.

**బోడుప్పల్, మే 31 (ప్రజాతీర్పు )**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 380వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా బోడుప్పల్ భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు వెంకిర్యాల లక్ష్మీ నరసయ్య ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి కృష్ణ, ఇతర అసోసియేషన్ సభ్యులు తాపీ మేస్త్రి యూనియన్ సభ్యులను దళారులు అని, బ్రోకర్లు అని, ఇంటి యజమానుల వద్ద అధిక డబ్బులు వసూలు చేసి మోసం చేస్తారని చిత్త వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి రోడ్డుపై బైఠాయించి నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకిర్యాల లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ కలిసిమెలిసి ఉండాల్సిన వారు తాపీ మేస్త్రీలపై అనుచిత వ్యాఖ్యలు చేసి వారి మనోభావాలను తీవ్రంగా పెద్ద తీసారని, తాపీ మేస్త్రి లేకుండా ఇంటి నిర్మాణం కొనసాగదని, తక్షణమే సెంట్రింగ్ యూనియన్ సభ్యులు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం బోడుప్పల్ భవన నిర్మాణ కార్మిక సంఘం చైర్మన్, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య మాట్లాడుతూ పాలు- నీళ్లల కలిసి పని చేయాల్సిన వారు, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని, తాపీ మేస్త్రి లేనిది సెంట్రింగ్ వర్క్ ఉండదని, ఇంటి యజమానితో తాపీ మేస్త్రికే ఎక్కువ అనుబంధం ఉంటుంది తప్ప సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు ఇంటి యజమానులకు ఎలాంటి సంబంధం ఉండదని, తక్షణమే సెంట్రింగ్ యూనియన్ సభ్యులు క్షమాపణలు చెబుతూ కరపత్రాలు విడుదల చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా తాపీ మేస్త్రీలు నిరసన కార్యక్రమాలు చేస్తారని హెచ్చరిస్తూ, అనుష్క వ్యాఖ్యలు చేసిన సెంట్రింగ్ యూనియన్ సభ్యుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య, యేసు రాజు, బోడుప్పల్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నిడుమనూరు బ్రహ్మయ్య, కోశాధికారి నాగిని శ్రీను, కార్యవర్గ సభ్యులు జడ శ్రీనివాస్, బండారి కురుమయ్య, రామకృష్ణ, గుంజి శ్రీనివాస్, నిడమనూరు సుబ్బయ్య, కుంచాల శ్రీనివాస్, నిడమనూరు సుబ్బారావు, వై గోపి, ఏ బాల కుమార్, సాయి , జి కొండయ్య, రాము, శ్రీను, బాల మధు, జి లక్ష్మీనారాయణ , తదితరులు పాల్గొన్నారు.

# యాదవులను పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్..

- బీసీ కార్పొరేషన్ ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది..

**సిద్దిపేట మే 31 (ప్రజాతీర్పు)**



యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కార కార్యక్రమం లో పాల్గొన్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు .మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యాదవులను పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని యాదవ సంఘం లో ఏర్పాటుచేసిన యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కార అభినందన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కెసిఆర్ హయాంలో యాదవుల సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. చట్టసభల్లో సైతం అవకాశం కల్పించామన్నారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం లో కనీసం బీసీ కార్పొరేషన్ లేదు బీసీల అభివృద్ధికి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బిసి గురుకులాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో తప్ప చేతల్లో లేదన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టి అమలు చేసిన గొర్రెల పథకాన్ని నేడు కాంగ్రెస్ సర్కార్ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తండ్రి తనులతో పాటు చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తేవాలన్నారు. తమ పిల్లలు ఉన్నత స్థాయి స్థానాల్లో ఉండాలన్నదే ప్రతి తల్లిదండ్రుల కోరిక అని ఈ కోరికను ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివి నెరవేర్చాలన్నారు. కుల సంఘాలు జాతి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చదువుకు కులం,పేదరికం అడ్డు కాదని కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు అన్నారు. ఈ పురస్కారాలు, అవార్డులు అందజేయడంతో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం లభిస్తుందన్నారు. యాదవ సమాజంలో సైతం విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయి స్థానాల్లో నిలుస్తున్నారన్నారు.



## వరి కొయ్యలకు నిప్పు.. పామాయిల్ తోట బూడిద..

**సిద్దిపేట జిల్లా కోహెడ మే 31 ప్రజాతీర్పు**

కోహెడ మండలం శ్రీరాములపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు అదుపు తప్పి విస్తృతంగా వ్యాపించాయి. ఈ మంటలు సమీపంలోని పరివేద గ్రామం వరకు వ్యాపించి రైతులకు భారీ నష్టం కలిగించాయి.పరివేద గ్రామానికి చెందిన నాంపల్లి శ్రీనివాస్‌కు చెందిన రెండున్నర ఎకరాల పామాయిల్ తోట పూర్తిగా కాలిపోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్ వ్యవస్థతో పాటు 30 స్ప్రింక్లర్ పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపాడు. ఈ అగ్నిప్రమాదం వల్ల సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నాడు. అలాగే శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతుల వ్యవసాయ భూముల్లో ఉన్న పైపులు, విద్యుత్ వైర్లు కూడా మంటల్లో కాలిపోయినట్లు సమాచారం. రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వరి కొయ్యలకు నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.స్థానిక అధికారులు ఘటనపై విచారణ చేపట్టి నష్టాన్ని అంచనా వేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



## జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 31**

జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆదివారం రాత్రి రాష్ట్ర ఆబ్కారీ – మధ్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలోని నస్పూర్ మండలం సి.సి.సి. లోని సింగరేణి అతిథి గృహానికి చేరుకున్న సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ఎ.సి.పి. ప్రకాష్, అధికారులతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.

## ఏజెన్సీ ప్రాంత ఎస్సీల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో సమావేశం

### భారీ సంఖ్యలో హాజరుకావాలని దుర్గం నగేష్ పిలుపు

**హైదరాబాద్ మే 31, (ప్రజాతీర్పు)**



ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్ కులాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జూన్ 5న హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశానికి భారీ సంఖ్యలో తరలిరావాలని ఏజెన్సీ షెడ్యూల్ కులాల ఐక్యవేదిక, సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర నాయకుడు డాక్టర్ దుర్గం నగేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్ కులాల ప్రజలు భూ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 5వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఈ సమావేశం జరుగుతుందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై ఏజెన్సీ ప్రాంత ఎస్సీల సమస్యలను ప్రత్యక్షంగా వింటారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్ కులాల కుటుంబాలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగార్థులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని, వేలాది మంది గొంతుకలు ప్రభుత్వాన్ని స్పందించేలా చేయగలవని ఆయన పేర్కొన్నారు. సమావేశాన్ని విజయవంతం చేసి ఏజెన్సీ ప్రాంత ఎస్సీల హక్కుల సాధనకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు.



## విద్యుత్ షాక్ తో మరణించి మేకలు

**వి,వెంకటేష్, ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్ )మే 31**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం లో కురిసిన వర్షానికి 13 వ వార్డు గాంధీనగర్ లో గాలి దుమరం తో కూడిన వర్షానికి విద్యుత్ ఫోల్ ఫవర్ ఉండగానే పడడంతో విద్యుత్ షాక్ తో చిప్ప సురేష్ మేకలు మరణించడం జరిగింది . విషం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్, సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ వాళ్లను పిలిపించి ఫవర్ బంద్ చేయించి వెటర్నరీ డాక్టర్ తో మాట్లాడి పంచనామా చేయించడం జరిగింది అలాగే బాధితులకు గవర్నమెంట్ నుండి ఆర్థిక సహాయం అందే విధంగా చేపిస్తానని హామీ ఇవ్వడం జరిగింది

## "సదా మీ సేవలో" షార్ట్ ఫిలింకు తృతీయ ఉత్తమ చిత్ర అవార్డు

- రామగుండం యువ దర్శకుడు మోదుంపల్లి రామస్వామికి రాష్ట్రస్థాయి గుర్తింపు

**గోదావరిఖని మేం 31,( ప్రజాతీర్పు ):**




రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన యువ షార్ట్ ఫిలిం దర్శకుడు మోదుంపల్లి రామస్వామి మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన "సదా మీ సేవలో" షార్ట్ ఫిలిం మంచిర్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి షార్ట్ ఫిలిం పోటీల్లో తృతీయ ఉత్తమ చిత్రంగా ఎంపికై అవార్డును సొంతం చేసుకుంది. మంచిర్యాలలో "శ్రీనీహ బ్యూటీ అండ్ మేకప్" సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక చిత్రాలు పోటీపడ్డాయి. రామగుండానికి చెందిన "పల్లవీచరణం మీడియా" క్రియేషన్ ఛానల్ ద్వారా విడుదలైన "సదా మీ సేవలో" చిత్రం కథా బలం, సామాజిక సందేశం, నటీనటుల సహజ నటనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని తృతీయ బహుమతిని దక్కించుకుంది. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రముఖులు డాక్టర్ నీలకంటేశ్వర్ రావు, సిరిపురం రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మోదుంపల్లి రామస్వామి, నిర్మాత ఆరుముల్ల భూమయ్య, నటీనటులు జక్కని శ్రీలత నేత, గొల్లపల్లి రామలింగం, కంది నాగరాజు తదితరులు మెమొంటోలు స్వీకరించారు. చిత్ర బృంద సభ్యులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మాట్లాడిన అతిథులు, పరిమిత వనరులతోనూ సమాజానికి ఉపయోగపడే సందేశాలను షార్ట్ ఫిలింల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్న యువ దర్శకులు, కళాకారులు అభినందనీయులని కొనియాడారు.అవార్డు అందుకున్న అనంతరం దర్శకుడు మోదుంపల్లి రామస్వామి మాట్లాడుతూ, "సదా మీ సేవలో చిత్రానికి లభించిన ఈ గుర్తింపు మొత్తం చిత్ర బృందానికి దక్కిన గౌరవం. నిర్మాత, నటీనటులు, సాంకేతిక నిపుణులు, ప్రేక్షకుల సహకారంతోనే ఈ విజయం సాధ్యమైంది. ఈ అవార్డు మాపై మరింత బాధ్యతను పెంచింది. భవిష్యత్తులో కూడా సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక చిత్రాలను రూపొందిస్తాం" అని తెలిపారు. రామగుండం ప్రాంతానికి చెందిన ఓ షార్ట్ ఫిలిం రాష్ట్రస్థాయి పోటీల్లో అవార్డు సాధించడం స్థానిక కళాకారుల్లో ఉత్సాహాన్ని నింపింది. చిత్ర బృందానికి పలువురు ప్రముఖులు, సినీ అభిమానులు, స్థానిక ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ విజయం రామగుండం ప్రాంత యువ కళాకారులకు మరింత ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## కమలం పార్టీలో చేరికల జోష్... బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నాయకులు మరియు వివిధ కాలనీవాసులు

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్). మే. 31**

మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్ పేట్ సర్కిల్ లో గల మీర్ పేట్ డివిజన్ బిజెపి అధ్యక్షులు తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు మేకల కృష్ణ మరియు వివిధ కాలనీ వాసులు నాదర్గుల్ లోని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి కార్యాలయంలో.... నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీరాములు కి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై విశ్వాసంతో ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శులు నీలా రవి నాయక్ , విజయ లక్ష్మి రాజు ముదిరాజ్ , ప్రధాన కార్యదర్శి సిద్దాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు సుల ప్రభాకర్, తులసి వెంకటేశ్వర్లు, కిషోర్, తుమ్మల రమేష్, జగన్ ముదిరాజ్, భాస్కర్, శ్రీను, శశి, లక్ష్మణ్, లింగస్వామి, సత్యనారాయణ, వెంకట్, మెరుగు శంకర్, రవికుమార్, శ్రీనివాస్, జి శ్రీనివాస్, రమేష్, బండి వెంకటేష్, మల్లయ్య, మహేష్, వెంకటేష్, సైదులు, సిద్ధార్థ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



## జూన్ 2 న ఉద్యమకారుల ర్యాలీ విజయవంతం చేద్దాం

**హుస్నాబాద్ మే 31 ప్రజా తీర్పు**

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటుచేయడాన్ని హుస్నాబాద్ నియోజక వర్గం ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఆ కమిటీ కేవలం రాజకీయ కమిటీ లాగా ఉండడం వల్ల సమగ్రంగా లేదని, అందులో ఉద్యమ సంస్థల ముఖ్యులను , మేధావులను చేర్చాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ జూన్ 2 న మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం ఇవ్వడానికి నియోజక వర్గం లోని ఉద్యమకారులందరూ రాజకీయ పార్టీలకతీతంగా , ఉద్యమ సంస్థలు, ఉద్యోగ ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థి, యువజన, కర్షక , కార్మిక, జర్నలిస్టుల, వివిధ వృత్తి సంఘాల ఉద్యమకారులు పాల్గొనాలని హుస్నాబాద్ జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. జేఏసీ కో కన్వీనర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ....ఉద్యమ కమిటీ లో రిటైర్డ్ జడ్జి లేదా ఐఏఎస్, ఐపీస్ లను కమిటీ లో సభ్యులుగా చేర్చి విస్తరించడం ద్వారా సమగ్రంగా ఉంటుందని,కేసులకు సంబంధం లేకుండా నికార్సైన ఉద్యమ కారులను గుర్తించాలని, ఉద్యమకారులకు 250 గజాల ఇండ్ల స్థలాలు,రూ.25 వేల పెన్షన్, ఉచిత విద్య, వైద్యం, ఉచిత ఆర్టీసీ ప్రయాణం అందించాలని, ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన వారికి వయస్సుతో సంబంధం లేకుండా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని తదితర అంశాలను పరిశీలించి అమలు చెయ్యాలని , సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని మంత్రి కి వినతి పత్రం ఇవ్వడానికి అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 2న హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తా నుండి ఉదయం గం. 9 లకు ర్యాలీ ప్రారంభం అయి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వరకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేకల వీరన్న యాదవ్, మడప ప్రభాకర్ రెడ్డి, కోయడ కొమురయ్య, బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఐలెని మల్లికార్జునరెడ్డి, ఉప్పల వెంకటరమణా రెడ్డి, ఎడబోయిన తిరుపతి రెడ్డి, అన్వర్, గడిపె మల్లేష్, లావుద్య కిషన్ నాయక్, ఇల్లందుల లక్ష్మణ్ , భుక్య రమేశ్ నాయక్, పి. రాజ్ కుమార్, బండి పుష్ప, బత్తుల చంద్రమౌళి, మెతుకు కొమురయ్య, ఎం. ప్రభాకర్ రెడ్డి, ఎన్. అజయ్ కుమార్, చింతల రామచంద్రం, జె. యాదగిరి, వినీత్, తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రోడ్డు వెడల్పు పనులు పరిశీలించిన విప్

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మే 31:**

వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం వేములవాడ పట్టణంలో రాజన్న ఆలయం ముందు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా వేములవాడ పట్టణ అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రులు, దేవదాయ శాఖ జిల్లా మంత్రుల సహకారంతో పనులను వేగవంతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాజన్న ఆలయంలో సుమారు రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఆలయం ముందు నుంచి బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. నిర్వాసితులు, దుకాణదారులు, పట్టణ పెద్దలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ పనులు ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు. ఈ రోడ్డుకు సంబంధించి సుమారు రూ.6.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయనీ, కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు పూర్తి చేసి అప్పగిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరితగతిన తారు రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో బ్యూటిఫికేషన్ పనుల కోసం రూ.2.60 కోట్లతో చర్యలు తీసుకున్నామని, సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వనమహోత్సవం సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే అన్నదాన సత్రం పనులు రూ.35 కోట్లతో కొనసాగుతున్నాయని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బీమేశ్వర ఆలయాన్ని రూ.6 కోట్లతో ఆధునికరించినట్లు తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి పూర్తయ్యే వరకు భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు.

# ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత

## ఆదిలాబాద్ బీఎల్ఏ-2 సమావేశంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 31**



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ-2 సమావేశానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా జిల్లా కేంద్రానికి చేరుకున్న ఎంపీకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి సమావేశంలో పాల్గొని సంస్థాగత బలోపేతం, ఓటరు జాబితాల పరిశీలన, బూత్ స్థాయి కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసేలా బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికల కమిషన్‌ను ముందుంచి కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రాంతీయ పార్టీలకు బలంగా ఉన్న నియోజకవర్గా ల్లో ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు,జరుగుతున్నాయని ఆరోపించారు. ఏ బూత్‌లో ఏ పార్టీకి ఎక్కువ మద్దతు ఉందో ప్రత్యేకంగా గుర్తించి అక్కడ ఓటర్లను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఓటు చోరీ అంశాన్ని ముందుకు తీసుకొచ్చారని, ఇప్పుడు దేశ ప్రజలందరూ అదే విషయాన్ని కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును దూరం చేసే ప్రయత్నాలను ప్రజాస్వామ్య శక్తులు కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి బీఎల్ఏ అంబేద్కర్ స్ఫూర్తితో పనిచేస్తూ ప్రతి బూత్‌లో ఓటు హక్కును పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.దేశంలో నీట్ పరీక్షల నిర్వహణపై కూడా ఎంపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్య, ఉపాధి అవకాశాల విషయంలో యువతకు భరోసా కల్పించే దిశగా కేంద్రం పనిచేయాలని కోరారు. తెలంగాణ రాజకీయాలపై స్పందిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, విమర్శించారుయువతను రెచ్చగొట్టి కేసుల్లో ఇరికించే రాజకీయాలు మంచివి కావని, యువత చదువు, ఉపాధి, భవిష్యత్తుపై దృష్టి పెట్టేలా రాజకీయాలు ఉండాలని పేర్కొన్నారు.బీఎల్ఏ-2 సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల ఏర్పాటు, ప్రజా సమస్యలపై స్పందన, రాబోయే రాజకీయ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలు జీవితాల్లో వెలుగులు నింపాయి

**హుస్నాబాద్ మే 31 ప్రజా తీర్పు**



గురుకుల పాఠశాలలో చదవడం ద్వారా తమ జీవితాల్లో వెలుగులు నింపాయని హుస్నాబాద్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి ప్రస్తుత గచ్చిబౌలి సీఐ కన్న మధు అన్నారు. 1996 నుండి 2016 బ్యాచ్ లకు చెందిన పూర్వ హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్ లో ఉత్సాహభరితంగా ఘనంగా నిర్వహించారు. 20 బ్యాచులకు చెందిన విద్యార్థులు ఆటపాటలతో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు కరతాల ధ్వనులతో పూలు వెదజల్లి స్వాగతం పలికారు. ఈ అపురూపమైన స్వాగతంతో ఉపాధ్యాయులు సంతోషించి పోయారు. దాదాపు 70 మంది ఉపాధ్యాయులు 600 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. 20 బ్యాచ్ లకు చెందిన విద్యార్థులు అందరూ ఒకే చోట కలుసుకోవడంతో ఆప్యాయతగా పలకరించుకోవడం, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం, స్థిరపడ్డ రంగాల గురించి మాట్లాడుకోవడం వంటి విషయాలతో ఆదివారాన్ని ఆనందంగా గడిపారు. కాగా గురుకులంలో చదువుకున్న విద్యార్థులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, వ్యాపారవేత్తలుగా, కానిస్టేబుళ్లు, లాయర్లు, ఎస్సైలు, సిఐలు, సిఆర్పిఎఫ్ జవాన్ లుగా మరెన్నో రంగాల్లో స్థిరపడంతో ఆశాంతం కార్యక్రమం అందర్నీ ఆకట్టుకుంది. హుస్నాబాద్ గురుకుల పూర్వ విద్యార్థి ప్రస్తుత గచ్చిబౌలి సీఐ కన్నం మధు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.... సంక్షేమ సంక్షేమ గురుకుల పాఠశాలలు బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాయని, కాబట్టి ప్రభుత్వం అందించే విద్యా అవకాశాలు వినియోగించుకొని తమ జీవితాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. తన జీవితంలో మర్చిపోని అనుభూతిని హుస్నాబాద్ లో చదవడం మూలంగానే తాను సమాజంలో గొప్ప వ్యక్తిగా ఎదిగానని అన్నారు. మరో గురుకుల పూర్వ విద్యార్థి ప్రస్తుత న్యాయవాది జే.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.... 20 సంవత్సరాల తర్వాత తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గురుకుల పాఠశాల విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రభుత్వ అధికారులుగా ఉండడం సంతోషకరమని అన్నారు. మరి ఎంతోమంది గురుకుల పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను ఈ కార్యక్రమాల ద్వారా పంచుకున్నారు. అలాగే సీఐ. రమేష్ ఎస్సైలు అంజయ్య,రాజు ప్రోగ్రాం నిర్వాహకులు వేల్పుల కుమార్ ఇ. నరేష్. ఉపాధ్యాయులు పి. డి. శ్రీనివాస్ లక్ష్మి కాంతారావు శివ ప్రసాద్ సత్తయ్య, సత్యనారాయణ రెడ్డి, విద్యార్థులు మంద శ్రీనివాస్ వేల్పుల మహేందర్ లంబ లక్సమాన్, కన్నూరి సురేందర్,చిరంజీవి, పొన్నాల వినోద్, అశోక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ లక్ష్మణ్ సూచనలు

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే31**

పహాడీ షరీఫ్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీరామ కాలనీలో నివసించే యువత మరియు తల్లిదండ్రులతో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణ్,ఏఎస్ఐ నరసింహ ముఖ్యంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మరియు తల్లిదండ్రులు సమాజంలో జరుగుతున్న నేరాలు,ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆన్‌లైన్‌లో ఎక్కువసేపు గడపకుండా జాగ్రత్త పడాలని,అనుమానాస్పద లింకులు లేదా అపరిచిత వ్యక్తులతో సంబంధాలు పెట్టుకోవద్దని హెచ్చరించారు.చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకుండా ఉండాలని,వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎల్లప్పుడూ నిఘా ఉంచాలని తెలిపారు.పిల్లలకు సమాజంలో జరుగుతున్న మంచి-చెడు విషయాలపై అవగాహన కల్పించడం అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణ్,ఏఎస్ఐ నరసింహ,పిసి నరేష్,పిసి బిచ్చయ్య నాయక్ తదితర పోలీస్ సిబ్బంది,స్థానిక యువత మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కెఎల్ఆర్ కు అద్భుత చిత్రపటం బహుకరణ

### బాలాపూర్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే. 31**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి బాలాపూర్ కాంగ్రెస్ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు కలిసి మొన్న తుక్కుగూడ కార్యాలయంలో ప్రత్యేకంగా తయారు చేయించిన అద్భుత చిత్రపటానికి బహూకరించారు. శ్రీ రామలింగేశ్వర దేవాలయం ఛైర్మన్ టేకుల శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో చిరునవ్వు చిందుస్తూ గీసిన కెఎల్ఆర్ భారీ చిత్రపటాన్ని ఆత్మీయంగా ఇచ్చారు. అనంతరం వేదపండితులు ఆశీర్వాచనం అందించారు.ఈ సందర్భంగా కిచ్చెన్న... బాలాపూర్ నేతల ఆత్మీయతకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బండారి మనోహర్, బాలు నాయక్, బాలాపూర్ అధ్యక్షులు టేకుల సుధాకర్ రెడ్డి, కల్లెం మల్లారెడ్డి, ఆలయ పురోహితులు దుర్గప్రసాద్ శర్మ సహా నవారు మల్లారెడ్డి, బోయపల్లి గోవర్దన్ రెడ్డి పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు

## మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పుట్టినరోజు ఘనంగా నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 31**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, పుట్టినరోజు సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు సాన శ్రావణ్, కొట్టే వినయ్, కొట్టే రాకేష్. పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, దుర్గం చిన్నయ్య అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరి లోని చాణిక్యపురి పార్క్ అభివృద్ధికి రూ.2 కోట్ల

**(వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ జిల్లా) మే 31**

మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు మరోసారి శ్రీకారం చుట్టారు. చాణిక్యపురి కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు స్థానిక పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్క్‌ను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.2 కోట్ల విలువైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం చాణిక్యపురి కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే, పార్క్ ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. పార్క్‌ను ప్రజలకు మరింత ఉపయోగకరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు వాకింగ్ ట్రాక్‌లు, గ్రీనరీ, పిల్లల ఆట స్థలాలు, సిట్టింగ్ ఏరియాలు, ఆధునిక లైటింగ్ తదితర సదుపాయాలతో అభివృద్ధి చేయాలని సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పార్క్ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానుండటంపై హర్షం వ్యక్తం చేశారు. కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, మల్కాజిగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ప్రజల సూచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆల్విన్ జోసెఫ్, విశ్వనాథ్, సజయ్ కుమార్, శిభు చాకో, వీణ, సుజా కిషోర్, రెజీనా మాథ్యూస్, శ్రీజ గోపు కుమార్, మోసెస్, శ్రీనివాస్, చక్రి, గోపు కుమార్, ఉదయ్ సింగ్, అనిల్ గోపన్, అంజిత్ కుమార్, కాశీనాథ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు వెంకన్న, శ్రీనివాస్ గౌడ్, నీలం సతీష్, సైదులు, జనార్ధన్, సుధాకర్, కోటేష్, శ్రీకాంత్, కిరణ్, ఇస్మాయిల్, కోటేశ్వర, రాజు, ప్రభాకర్ మరియు కాలనీ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## కుల బహిష్కరణ అబద్ధం

- పోలీసులు విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి
- నాగారం ముదిరాజ్ కుల సంఘం నాయకులు

**హుస్నాబాద్ మే 31 ప్రజాతీర్పు**

కుల బహిష్కరణ చేశారని అబద్ధం చెప్పి పోలీస్ స్టేషన్లో అన్యాయంగా మాపై కేసు పెట్టాడని హుస్నాబాద్ మండలం నాగారం గ్రామంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి చెందిన ఆకుల బాలయ్య అనే వ్యక్తిని కులం నుంచి బహిష్కరించామని గ్రామానికి చెందిన 70 మందిని అరిగోశ పెడుతూ పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నాడని ఆదివారం మీడియా ముందు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాలకు ప్రకారం గతంలో గ్రామంలోని చెరువు విషయంలో ఉల్లంపల్లి ముదిరాజ్ కుల సంఘానికి, నాగారం ముదిరాజ్ కుల పెద్దలకు గొడవలు జరిగాయని, పెద్ద మనుషుల సమక్షంలో కూర్చుని మాట్లాడుకుందామన్న వినకుండా గతంలో మాపై కేసు పెట్టాడని ఆ కేసు లోక్ అదాలత్ లో కొట్టుడు పోయిందని తెలిపారు. గొడవల తరువాత నాగారం గ్రామ కుల సంఘానికి వ్యతిరేకంగా పనిచేస్తూ ఉల్లంపల్లి కుల సంఘానికి మద్దతుగా ఉండే వాడని అన్నారు. ఈ సమయంలో అందరం కలిసి మెలిసి ఉండాలని తీర్మానం చేసుకున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా గత పది రోజుల క్రితం తమ కులానికి చెందిన వ్యక్తి చనిపోగా కుల సంఘం ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించడం ఆనవాయితిగా జరుగుతుందని, అందులో భాగంగా కుల పెద్దలందరు వచ్చి దహనం కోసం చితి ఏర్పాట్లు చేసిన అనంతరం ఆకుల బాలయ్య రాగా పని అంతా అయిపోయాక ఎందుకు వచ్చావని అనడంతో మమ్మల్ని ఇష్టానుసారంగా తిట్టి వెళ్లిపోయాడని, మరునాడు పోలీస్ స్టేషన్కు వెళ్లి కుల బహిష్కరణ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. తాము ఎవరిని కులం పేరుతో దూషించలేదని, కుల బహిష్కరణ చేశారని అబద్ధం అని, తప్పుడు కేసులు పెట్టడం బాలయ్యకు అలవాటేనని అన్నారు. కుల బహిష్కరణ పై పోలీసు అధికారులు విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

## మంథని... కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధితో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపడతాయి..

### మంత్రి పొన్నం ప్రభాకర్

**మంథని, మే 31 (ప్రజాతీర్పు)**



మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధితో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపడతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గోదావరి పుష్కరాలు 2027 సందర్భంగా భారీ స్థాయిలో ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మంథని మున్సిపాలిటి పరిధిలోని మంథని బస్టాండ్‌లో రూపాయలు 93 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మంత్రి శ్రీధర్ బాబు సూచనల మేరకు మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గోదావరి పుష్కరాలు 2027 నిర్వహణ కోసం ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటిని నియమించిందని, కుంభమేళాను తలపించే స్థాయిలో పుష్కరాలు నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కోట్లాది మంది భక్తులు పుష్కరాలకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామం నుంచి పుష్కర క్షేత్రాలకు చేరుకునేలా ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు బస్టాండ్లను ఆధునికీకరించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సమ్మక్క--సారలమ్మ జాతరకు ఏర్పాటు చేసిన తరహాలోనే పుష్కరాల సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని తెలిపారు. గత పదేళ్లలో కొత్త బస్సుల కొనుగోలు, నియామకాలు, డిపోల ఏర్పాటు వంటి అంశాలను విస్మరించారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపట్టిందన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు, డిపోల ఏర్పాటు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ఇప్పటివరకు దాదాపు 310 కోట్ల జీరో టికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్టీసీ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తుండగా, బస్సులు దాదాపు 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించే దిశగా బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచుతున్నామని చెప్పారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గుర్తింపు సంఘాల ఎన్నికల అనంతరం కార్మిక ప్రతినిధులతో చర్చించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. కార్మికులు అపోహలు నమ్మవద్దని మంత్రి సూచించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మంథని బస్టాండ్‌లో రెండు అదనపు ప్లాట్‌ఫారాల నిర్మాణానికి రూ.74 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.19 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాళేశ్వరం బస్టాండ్ అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేశామని, కాళేశ్వరం దేవస్థాన అభివృద్ధిలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రజల ఆకాంక్షగా ఉన్న పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటు త్వరలోనే సాకారం కానుందని, మంథని బస్టాండ్ ఆధునికీకరణతో పాటు పెద్దపల్లి బస్ డిపోను కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో రవాణా శాఖ మంత్రి, ఇతర మంత్రులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల అనంతరం కార్మిక ప్రతినిధులతో చర్చించి ఆర్టీసీ విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, రీజనల్ కరీంనగర్ మేనేజర్ రాజు, డిప్యూటీ ఆర్.యం. ఎం మల్లేశం, డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్, ఆర్డీఓ సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తంలో ప్లేట్‌లెట్స్ వేగంగా పెంచే పండు ఏదో తెలుసా?





**రక్తంలో తక్కువ ప్లేట్‌లెట్లు ఉండటం చాలా ప్రమాదకరం. ఎందుకంటే ఇవి రక్తం గడ్డకట్టే సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. రక్తంలో ప్లేట్‌లెట్లు తక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉండవచ్చు. అయితే ప్లేట్‌లెట్లను పెంచడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. డెంగ్యూ బారిన పడిన వారిలో..**

రక్తంలో ప్లేట్‌లెట్స్ వేగంగా పెంచే పండు ఏదో తెలుసా? ప్లేట్‌లెట్లు.. రక్తం గడ్డకట్టడానికి, రక్తస్రావం ఆపడానికి, గాయాలు వేగంగా మానడానికి సహాయపడతాయి. రక్తంలో తక్కువ ప్లేట్‌లెట్లు ఉండటం చాలా ప్రమాదకరం. ఎందుకంటే ఇవి రక్తం గడ్డకట్టే సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. రక్తంలో ప్లేట్‌లెట్లు తక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉండవచ్చు. అయితే ప్లేట్‌లెట్లను పెంచడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. డెంగ్యూ బారిన పడిన వారిలో ఈ సమస్య సర్వసాధారణం. డెంగ్యూ రోగుల్లో ప్లేట్‌లెట్లు అకస్మాత్తుగా తగ్గుతాయి. ఇది రోగికి ప్రాణాంతకం కావచ్చు. ఈ సమస్యను మందులతో తాత్కాలికంగా తగ్గించగలిగినప్పటికీ.. దీర్ఘకాలిక శ్రేయస్సు కోసం సరైన ఆహారం తీసుకోవడం చాలా అవసరం. ఈ సమయంలో కొన్ని ఆహారాలు తీసుకోవాలి. కొందరు ఈ టైంలో బొప్పాయి తినాలని అంటుంటారు. మరికొందరు కివి రక్తంలో ప్లేట్‌లెట్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుందని అంటుంటారు. కానీ ఏది వాస్తవానికి ప్రభావవంతంగా ఉంటుందో ఇక్కడ తెలుసుకుందాం.. విటమిన్ సి

### కివిజి

ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా రక్త నాళాల బలాన్ని కాపాడుతుంది. కివిలో ఫోలేట్ ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాలు,ప్లేట్‌లెట్ల ఉత్పత్తికి సహాయపడుతుంది. రక్తం ఏర్పడటంలో ఫోలేట్ పాత్ర చాలా కీలకం. కివిలో పాలీఫెనాల్స్, కెరోటినాయిడ్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ప్లేట్‌లెట్లను ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. కివి జీర్ణక్రియకు సహాయపడుతుంది. జీర్ణక్రియ, పోషకాల శోషణకు సహాయపడే ఆక్టినిడిన్ ఎంజైమ్‌లను కలిగి ఉంటుంది. తద్వారా రక్త ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుంది. కివి తినడం వల్ల జ్వరం తర్వాత కోలుకోవడానికి సహాయపడే పొటాషియం, ఫైబర్‌ను అందిస్తుంది. ఇందులో నీరు, ఎలక్ట్రోలైట్లు అధికంగా ఉంటాయి. కివి వాపును తగ్గిస్తుంది. ఇది ఎముక మజ్జ బాగా పనిచేయడానికి, ప్లేట్‌లెట్లను ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది.

### బొప్పాయిజి

బొప్పాయిలో విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. కానీ కివి కంటే కొంచెం తక్కువ. డెంగ్యూ సమయంలో ప్లేట్‌లెట్లను పెంచడంలో బొప్పాయి ఆకుల రసం ప్రభావవంతంగా ఉంటుంది. బొప్పాయిలో బీటా–కెరోటిన్, ఫ్లేవనాయిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఇన్ఫెక్షన్ల నుంచి వేగంగా కోలుకోవడానికి సహాయపడతాయి. బొప్పాయిలోని పపైన్ ఎంజైమ్ జీర్ణక్రియను సులభతరం చేస్తుంది, తద్వారా శరీరం పోషకాలను సరిగ్గా ఉపయోగించుకుంటుంది. ప్లేట్‌లెట్లను పెంచుతుంది. బొప్పాయిలో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఇది నిర్జలీకరణాన్ని నివారిస్తుంది. మొత్తం కణ ఆరోగ్యానికి సహాయపడుతుంది. బొప్పాయిలోని కైమోపాపైన్, పపైన్ అనే పదార్థాలు మంటను తగ్గిస్తాయి.



# ఆకులతో ఆరోగ్యం!



**ఆకులతో ఆరోగ్యం! ఆయుర్వేదంలో 'నేరేడు'ది ప్రత్యేక స్థానం. దీని పండ్లు మాత్రమే కాదు.. ఆకులు కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అనేక ఔషధ గుణాలతో నిండిన నేరేడు ఆకులు.. వివిధ వ్యాధులను నివారించడంలో సమర్థంగా పనిచేస్తాయని చెబుతున్నారు.**

ఆయుర్వేదంలో 'నేరేడు'ది ప్రత్యేక స్థానం. దీని పండ్లు మాత్రమే కాదు.. ఆకులు కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అనేక ఔషధ గుణాలతో నిండిన నేరేడు ఆకులు.. వివిధ వ్యాధులను నివారించడంలో సమర్థంగా పనిచేస్తాయని చెబుతున్నారు. నేరేడు ఆకులను నమలడం వల్ల నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా మారుతాయి. వీటిలోని ఆయుర్వేద సమ్మేళనాలు.. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. నేరేడు ఆకుల కషాయం తాగితే.. విరేచనాలు ఇట్టే తగ్గిపోతాయి. కాలేయం పనితీరు కూడా మెరుగుపడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలూ తగ్గిపోతాయి. నేరేడు ఆకుల్లో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలం. ఇవి రక్తంలో చక్కెర విడుదలను నియంత్రిస్తాయి. దాంతో, షుగర్ లెవల్స్ తగ్గుతాయి. అలా.. మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుతాయి. భోజనానికి ముందు.. ఓ టీస్పూన్ నేరేడు ఆకుల రసాన్ని తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. నేరేడు ఆకుల రసంలో కొద్దిగా ధనియాలు వేసి తాగితే.. జ్వరం తగ్గిపోతుంది.




## ఏయే వ్యాధులు ఉన్నవారు ఏయే మిల్లెట్స్‌ను తింటే ఫలితం ఉంటుంది..?

ప్రస్తుతం చాలా మందికి ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగింది. అందుకనే ఆరోగ్యంగా ఉండడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాయామం చేయడంతోపాటు ఆహారం విషయంలోనూ అనేక మార్పులు చేసుకుంటున్నారు. అందులో భాగంగానే ఒకప్పుడు మన పూర్వీకులు తిన్న చిరు ధాన్యాలను ఇప్పుడు చాలా మంది తినేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. చిరు ధాన్యాలనే సిరి ధాన్యాలు, మిల్లెట్స్ అని కూడా పిలుస్తారు. ప్రస్తుతం చాలా మంది వీటిని తింటున్నారు. మిల్లెట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చు. అందుకనే చాలా మంది తమ రోజు వారి ఆహారంలో మిల్లెట్స్‌ను భాగం చేసుకుంటున్నారు. మిల్లెట్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది అనేక వ్యాధులను తగ్గించేందుకు సహాయం చేస్తుంది. అయితే మిల్లెట్స్‌లో అనేక రకాలు ఉంటాయి. మనకు ఉన్న భిన్న రకాల వ్యాధులను బట్టి భిన్నమైన మిల్లెట్స్‌ను తినాల్సి ఉంటుంది. అప్పుడే ఆశించిన స్థాయిలో ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.



## పాలకూర జ్యూస్‌ను తాగుతున్నారా..? అయితే ఈ జాగ్రత్తలను పాటించాల్సిందే..!

పాలకూర మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటుంది. పాలకూరతో చేసే వంటలను అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. దీంతో అనేక కూరలు, ఇతర వంటకాలను చేయవచ్చు. ఆరోగ్యంగా ఉండాలంటే పాలకూరను తరచూ తినాలని పోషకాహార నిపుణులు కూడా చెబుతుంటారు. పాలకూరలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని పోషకాలకు నెలవుగా అభివర్ణిస్తుంటారు. పాలకూరను రోజూ తినడం కన్నా జ్యూస్ చేసి తాగితే మేలు అని చాలా మంది భావిస్తుంటారు. ఉదయం పరగడుపునే దీని జ్యూస్‌ను తాగుతుంటారు కూడా. అయితే పాలకూర జ్యూస్‌ను రోజూ తాగే వారు కొన్ని జాగ్రత్తలను తప్పక పాటించాలని, లేకపోతే లాభం కలగకపోగా నష్టం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.



## కిడ్నీలకు గండాలు దీర్ఘకాలపు మందులు

మానవ శరీర ప్రధాన వ్యవస్థల్లో మూత్రపిండాలు ఒకటి. రక్తాన్ని శుద్ధి చేయడంలో, రక్తపోటును నియంత్రించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో లేకపోతే కిడ్నీలు ప్రమాదంలో పడినట్టే. కాబట్టి, బీపీ, షుగర్ ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, జీవితకాలం మందులు వాడేవారు, పెయిన్ కిల్లర్స్, యాంటిబయాటిక్స్‌కు అలవాటుపడిన వారు.. తరచూ మూత్రపిండాల పనితీరును పరీక్షించుకోవాలి. అందులోనూ, ఈ మధ్యకాలంలో కిడ్నీ వ్యాధులు పెరిగిపోతున్నాయి. డయాలసిస్ రోగుల సంఖ్య కూడా అధికం అవుతున్నది. మనదేశంలో 18 శాతానికి పైగా జనాభాకు ఏదో ఒక రకం కిడ్నీ జబ్బులు ఉన్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇక పెయిన్ కిల్లర్స్, యాంటిబయాటిక్స్ కూడా మూత్రపిండ వ్యాధులకు దారితీస్తున్నాయి. అందువల్ల, ఈ తరహా ఔషధాలు అనివార్య మైనప్పుడు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మూత్రపిండ వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు.



Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020